PRABHATA SURYA
ప్రభాత సూర్య
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వెల రూ.5/ - పేజీలు : 8 శనివారం 21 జూన్ 2025 సంపుటి: 01, సంచిక : 45
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## నార్త్ రింగరోడ్డుకు మహర్ధశ

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంగతి తెలిసిందే. ఉత్తర, దక్షిణ రెండు భాగాలుగా ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగు రోడ్డు నుంచి సుమారు 40 కి.మీ దూరంతో ఈ ప్రాజెక్టుని నిర్మిస్తున్నారు. అయితే ఉత్తర భాగం పనుల టెండర్లపై ప్రస్తుతం ఉత్కంఠ కొనసాగుతోంది. బిడ్లు సమర్పించడానికి జూన్ 18 వరకు మాత్రమే గడువు ఉండగా.. 19న టెండర్లను తెరవాల్సి ఉంటుంది. గతేడాది డిసెంబరు 27న భారత జాతీయ రహదారుల అధికార సంస్థ ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనుల కోసం ఐదు ప్యాకేజీలుగా టెండర్లను ఆహ్వానించింది.






## ప్రజాసేవ చేయకపోతే ప్రశాంతంగా నిద్రించలేను

- రాత్రి పగలు ప్రజల కోసమే పని చేస్తున్నా
- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నా హృదయంలో ఉన్నాడు
- ఆయన చిత్రపటాన్ని గుండెకు హత్తుకోవడం ఇష్టం
- ప్రధాని మోదీ స్పష్టీకరణ
- బిహార్, ఒడిశాలో ప్రధానమంత్రి పర్యటన



## అంధ విద్యార్థుల పాట విని.. పుట్టినరోజున రాష్ట్రపతి ముర్ము కంటతడి

- తన ప్రజా జీవితంలో గుర్తుండిపోయే క్షణాల్లో ఇది ఒకటి
- "నేను కన్నీళ్లను ఆపుకోలేకపోయాను
- వారు ఎంతో అందంగా పాడారు'

## ఏ రాష్ట్రంతోనూ
# వివాదాలు కోరుకోం

- అవసరమైతే ఏపీ సీఎంను మేమే ఆహ్వానిస్తాం..
- అదే సమయంలో తెలంగాణ హక్కులను వదులుకోం
- 23న మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం.. బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- సమస్యకు మూలకారణం కేసీఆర్, హరీశ్‌రావులేనని ఆరోపణ
- భాజపాకు భారాస 'అవయవదానం'లా సీట్లిచ్చిందని విమర్శ
- అందుకే కిషన్‌రెడ్డి కేటీఆర్‌కు లైజనింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారని ఎద్దేవా



సూర్య దిల్లీ

విభజన చట్టం ప్రకారం గోదావరిపై పోలవరం ప్రాజెక్టుకు మాత్రమే అనుమతులున్నాయి. దానికి ఏ మార్పులు చేసినా తెలంగాణ నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. బనకచర్ల పోలవరానికి అనుబంధంగా నిర్మిస్తున్నందున మా అనుమతి తప్పనిసరి. "ఇరు రాష్ట్రాలు కూర్చొని మాట్లాడుకుంటే గోదావరి-బనకచర్ల సమస్య పరిష్కారమవుతుంది. ఇలా చర్చించుకోవడంలో మాకేమీ భేషజాలు లేవు. అలాగని తెలంగాణ హక్కులను కోల్పోవడానికి సిద్ధంగా లేం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన దిల్లీలోని తన అధికార నివాసంలో విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తెలంగాణ ప్రయోజనాలను ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టు పెట్టింది మాజీ సీఎం కేసీఆర్, నాటి ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావులేనని ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీల వాటా సరిపోతుందని 2015లో లేఖ ఇచ్చింది హరీశ్‌రావేనని, గోదావరి వరద నీటిని పెన్నా పరీవాహక ప్రాంతానికి తరలించడానికి అభ్యంతరం లేదంటూ 2016 నాటి ఎపెక్స్ కౌన్సిల్‌లో చెప్పింది కేసీఆరేనని ధ్వజమెత్తారు. అందుకు సంబంధించిన లేఖలు, మీటింగ్ మినిట్స్‌ను రేవంత్‌రెడ్డి మీడియాకు విడుదల చేశారు. "ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రతిపాదనలపై ముందుగా తెలంగాణ ప్రభుత్వ అభిప్రాయం అడిగి ఉండాల్సింది. ఎపెక్స్ - మిగతా2లో

## వ్యవసాయంలోనూ ఏఐ

**వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



సూర్య హైదరాబాద్

వ్యవసాయ రంగంలోనూ కృత్రిమమేధ(ఏఐ)ను వినియోగించి రైతులకు మరింత సమర్థంగా సేవలందించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు - మిగతా2లో

## సన్నాల బోనస్ విడుదల చేయాలి

**భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు**




సూర్య హైదరాబాద్

యాసంగిలో సన్నాల కొనుగోలు పూర్తయినా ఇంకా రూ.1,161 కోట్ల బోనస్ డబ్బులు విడుదల చేయకపోవడం అన్యాయమని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. '4.01 లక్షల మంది రైతుల నుంచి 23.22 లక్షల టన్నుల సన్నాలు సేకరించిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా బోనస్ చెల్లించలేదు. రాష్ట్రంలో పొద్దుతిరుగుడు - మిగతా2లో

## ఎగువ నీళ్లకు
# ఎగువనే అడ్డుకట్ట


- గోదావరి ఉపనది జలాల గరిష్ఠ వినియోగానికి ఛత్తీస్‌గఢ్ రెడీ
- బోధ్‌ఘాట్ బహుళార్థక సాధక ప్రాజెక్టుకు శ్రీకారం.. కేంద్రం అనుమతి!
- తెలంగాణ ప్రాజెక్టులకు నీటి లభ్యత కష్టమే అంటున్న నిపుణులు
- గోదావరిలో ఇంద్రావతి కలిసే ప్రాంతానికి దిగువనే దేవాదుల, సీతారామ, సమ్మక్క-సారక్క
- వీటికి దిగువన ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం
- గోదావరికి ప్రాణహిత తర్వాత ఇంద్రావతే ప్రధాన వనరుగా ఉన్న వైనం
- రూ.49 వేల కోట్లతో సుమారు 9.45 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చేలా ఛత్తీస్‌గఢ్ ప్రణాళికలు




సూర్య హైదరాబాద్

తెలుగు రాష్ట్రాలకు జీవనాడిగా ఉన్న గోదావరి నదికి ప్రాణహిత తర్వాత ప్రధాన ఉప నది అయిన ఇంద్రావతి నీటిని పూర్తిగా కట్టడి చేసేలా ఛత్తీస్‌గఢ్ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇంద్రావతిలో లభ్యతగా ఉన్న నీటిలో మెజా రిటీ జలాలను వినియోగించుకునేలా బోధ్‌ఘాట్ బహుళార్థక సాధక ప్రాజెక్టుకు అంకురార్పణ చేస్తోంది. ఇటీవలే ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం సైతం అనుమతినిచ్చిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ప్రకటించారు. ఇంద్రావతి నీటినే నమ్ముకొని తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులు చేపడుతుండటం గమనార్హం. కాగా ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ - మిగతా2లో


## రైతు రాజ్యం నిధులు విడుదల



- సాగు సాయం రూ.1.04 లక్షల కోట్లు
- ధాన్యం కొనుగోళ్లు, సన్నాల బోనస్‌కు రూ.43 వేల కోట్లు
- రైతు భరోసాకు రూ.21 వేల కోట్లు
- పంట రుణమాఫీకి రూ.20 వేల కోట్లు
- ఏడాదిన్నరలోనే వ్యవసాయానికి భారీగా నిధుల వ్యయం
- 'రైతు రాజ్యం' పేరిట విడుదల చేసిన నివేదికలో ప్రభుత్వం వెల్లడి

సూర్య హైదరాబాద్

వ్యవసాయ రంగం, రైతుల సంక్షేమానికి ఏడాదిన్నర వ్యవధిలోనే భారీగా నిధులు ఖర్చు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం అమలు చేసిన పథకాలకు రూ.1.04 లక్షల కోట్లను వెచ్చించినట్లు వెల్లడించింది. ధాన్యం కొనుగోళ్లు, సన్నాల బోనస్‌కు రూ.43 వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొంది. ప్రస్తుత వానాకాలంలో విడుదల చేస్తున్న - మిగతా2లో



## ఆంగ్ల భాష సిగ్గుచేటు కాదు.. విద్యార్థుల అభివృద్ధికి ఊతం

- కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ
- ప్రతి చిన్నారికి కచ్చితంగా ఆంగ్ల భాషను నేర్పించాలి
- ఆంగ్లం డ్యామ్ లాంటిది కాదు.. అది ఒక వంతెన
- పేదలు ఉన్నత చదువులు చదువుకుని.. సమానత్వాన్ని సాధించడం భాజపా, ఆరెస్సెస్‌లకు ఇష్టం లేదు

## మార్కులొస్తే కన్వీనర్ కోటాలో
# ఎంబీబీఎస్ సీటు!

- రాష్ట్రంలో జనరల్ కేటగిరీ విద్యార్థులకు అవకాశం
- బీసీలకు 335-400.. ఎస్సీలకు 350-365 మార్కులు
- ఎస్టీ కేటగిరీలో 360-375 మధ్య మార్కులొస్తే చాన్స్
- రాష్ట్రంలో సర్కారీ వైద్య కళాశాలల్లో 4,090 సీట్లు
- ఎయిమ్స్‌లో సీటు దక్కాలంటే 560 పైగా రావాలి



సూర్య హైదరాబాద్

నీట్ ఫలితాల వెల్లడితో విద్యార్థులు తమకు ఏ కాలేజీలో సీటు వస్తుందా అని లెక్కలు వేసుకుంటున్నారు. తమకు వచ్చిన ర్యాంకు, మార్కులు, సామాజికవర్గాల ఆధారంగా ఏ విద్యాసంస్థలో ఎంబీబీఎస్ ప్రవేశం దక్కుతుందనేదానిపై అంచనాలు రూపొందించుకుంటున్నారు. త్వరలోనే ప్రారంభమవనున్న ఆలిండియా కోటా సీట్ల కౌన్సెలింగ్‌కు మన రాష్ట్ర విద్యార్థులు సైతం పోటీపడనున్నారు. ఈ క్రమంలో ప్రతిభావంతులైన విద్యార్థులు కాకుండా మిగిలిన వారికి ఎన్ని మార్కులు వస్తే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కన్వీనర్ కోటాలో సీటు వస్తుందన్న దానిపై నీట్ - మిగతా2లో

# మార్కులొస్తే కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు!

-మొదటిపేజీ తరువాయి

నిపుణులు విశ్లేషణలు విడుదల చేశారు. తెలంగాణలో ప్రభుత్వ వైద్య కళాశాలల సంఖ్య 34కు చేరుకుంది. వాటిలో సీట్ల సంఖ్య 4090కు పెరిగింది. ఇందులో 15 శాతం సీట్లు అఖిల భారత కోటాకు వెళ్తాయి. అలాగే ఎయిమ్స్ బీబీనగర్‌లో 100, ఈఎసఐ సనత్‌నగర్‌లో 150 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ఇక ప్రైవేటులో 30 కాలేజీలు, 4600 సీట్లు ఉన్నాయి. ఇందులో కొన్ని కాలేజీలు గత ఏడాది డీమ్డ్ వర్సిటీలుగా మారాయి. వాటిలోని సీట్లు రాష్ట్ర పరిధిలోకి రావు. ప్రైవేటులో ఉన్న సీట్లలో 50 శాతం కన్వీనర్ కోటా కిందకు వస్తాయి. కాళోజీ యూనివర్సిటీ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 5500 వరకు కన్వీనర్ కోటా సీట్లున్నాయి.

**410 మార్కులొస్తే కన్వీనర్ కోటాలో అవకాశం**

ఈ ఏడాది 22.09 లక్షల మంది నీట్ పరీక్ష రాయగా.. 12.36 లక్షల మంది అర్హత సాధించారు. తెలంగాణ నుంచి 70259 మంది పరీక్ష రాయగా.. 41584 మంది ఉత్తీర్ణులయ్యారు. నిరుటితో పోలిస్తే ఈ సారి రాష్ట్రం నుంచి నీట్ రాసే వారి సంఖ్య 8 వేలు తగ్గింది. ఏపీ నుంచి 57 వేల మంది రాయగా.. 36 వేల మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది నీట్ పరీక్ష కఠినంగా రావడంతో విద్యార్థుల మార్కులు కూడా బాగా తగ్గాయి. గత ఏడాది దాదాపు 1500 మంది విద్యార్థులు 720కి గాను 700పైగా మార్కులు సాధించారు. ఈ ఏడాది జాతీయ స్థాయిలో 686 మార్కులే అత్యధికం. అలాగే 600కు పైగా స్కోర్ చేసిన వారు కేవలం 1250 మందే. దీన్నిబట్టి ప్రశ్నపత్రం ఎంత కఠినంగా వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. ఇక నీట్ రాసిన వారిలో 400 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు సుమారు 2 లక్షల మంది ఉంటారని అంచనా. నిరుటితో పోలిస్తే దేశవ్యాప్తంగా విద్యార్థులు సాధించిన మార్కులు భారీగా తగ్గాయి. మన రాష్ట్రంలో జనరల్ కేటగిరీ విద్యార్థులకు కన్వీనర్ కోటాలో సీటు దక్కాలంటే 410-425 మార్కులు రావాలని నిపుణులు చెప్పారు. ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 410 మార్కులు వచ్చిన వారికి అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో ఏయూ పరి?ధిలో జనరల్ కేటగిరీలో 475-480 మార్కులు, ఎస్వీయూ పరిధిలో 465-470 వచ్చిన వారికి కన్వీనర్ కోటా సీటు దక్కే అవకాశం ఉందని తెలిపారు. కాగా, ఈ ఏడాది జనరల్ కేటగిరీలో కటాఫ్ మార్కులు 144గా, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు 113గా నిర్ణయించారు.

**తొలుత ఆలిండియా కోటా కౌన్సెలింగ్**

దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని సీట్లలో 15 శాతం ఆలిండియా కోటాకు వెళ్తాయి. దేశవ్యాప్తంగా 20 ఎయిమ్స్ ఉన్నాయి. వీటిలో 2044 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. జిప్‌మర్ పుదుచ్చేరి, కరైకల్‌లో కలిపి 200సీట్లున్నాయి. అఖిల భారత కోటా కౌన్సెలింగ్ రెండు దఫాల్లో నిర్వహిస్తారు. సీటు వచ్చిన విద్యార్థులు తప్పనిసరిగా చేరాల్సి ఉంటుంది. ఈ కోటాలో సీటు వచ్చిన విద్యార్థులు రాష్ట్ర కౌన్సెలింగ్‌లో పాల్గొనడం కుదరదు. ఆలిండియా కోటా ముగిసిన తర్వాత రాష్ట్ర పరిధిలోని హెల్త్ యూనివర్సిటీ కౌన్సెలింగ్ నిర్వహిస్తుంది. ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని సీట్లన్నీ కన్వీనర్ కోటాలోకి వస్తాయి. ప్రైవేటులోని సీట్లలో 50% కన్వీనర్ కోటా కిందకు వస్తాయి. మిగిలిన 50% సీట్లలో 35% బీ కేటగిరీ (యాజమాన్య), మరో 15% సీ కేటగిరీ (ఎన్ఆర్ఐ) కోటాకు వెళ్తాయి. వీటికీ హెల్త్ వర్సిటీనే కౌన్సెలింగ్ నిర్వహిస్తుంది.

**ఎయిమ్స్‌లో సీటుకు 560 పైగా స్కోర్ చేయాలి**

జనరల్ కేటగిరీలో ఏదైనా ఎయిమ్స్‌లో సీటు రావాలంటే నీట్‌లో కనీసం 560 మార్కులకుపైగా స్కోర్ చేయాల్సి ఉంటుంది. ఢిల్లీ ఎయిమ్స్‌లో అయితే 650 పైగా రావాలి. మన రాష్ట్రంలోని బీబీనగర్ ఎయిమ్స్‌లో కటాఫ్ మార్కులు 580గా ఉండే అవకాశం ఉంది. మంగళగిరి ఎయిమ్స్‌లో 600గా ఉండే చాన్స్ ఉంది. అదే విధంగా ఆలిండియా కోటాలో జనరల్ కేటగిరీలో సీటు రావాలంటే ఆలిండియా ర్యాంకు సుమారు 23-25 వేల మధ్యలో ఉండాలి.

# ఎగువ నీళ్లకు ఎగువనే అడ్డుకట్ట..

-మొదటిపేజీ తరువాయి

తెరపైకి తెచ్చిన ఈ ప్రాజెక్టుతో దిగువ గోదావరిలో జలాల లభ్యత తగ్గిపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఛత్తీస్‌గఢ్ వినియోగించని జలాలనే ఆధారంగా చేసుకుని కేంద్రం గోదావరి%-%కావేరి అనుసంధానాన్ని తెరపైకి తెచ్చిన సంగతి తెలిసిందే.

ఇంద్రావతిలో ప్రతి ఏటా సుమారు 600%-%800 టీఎంసీల మేర లభ్యత ఉంటుందని కేంద్రం లెక్కలు చెబుతున్నాయి. ఇది ఛత్తీస్‌గఢ్‌లో 264 కిలోమీటర్ల దూరం ప్రయాణించి మేడిగడ్డ దిగువన, సమ్మక్క%-%సారక్క బరాజ్ ఎగువన గోదావరిలో కలుస్తుంది. దంతెవాడ, బీజాపూర్, సుక్మా, బస్తర్, కాంకేర్ జిల్లాల గుండా ప్రవహిస్తుంది. ఆయా జిల్లాలన్నీ తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దుల్లోనే ఉన్నాయి.

ఇంద్రావతి నీళ్లు కలిశాకే గోదావరి దిగువన ప్రవాహాలు మరింత ఉధృతంగా ఉంటాయి. కాగా ఇంద్రావతి నది గోదావరిలో కలిసే ప్రాంతానికి దిగువన, గరిష్ట నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ.. దేవాదుల (38 టీఎంసీలు), సీతారామ (70 టీఎంసీలు), సమ్మక్క%-%సారక్క (50 టీఎంసీలు మొత్తంగా 158 టీఎంసీలు) ప్రాజెక్టులు చేపట్టింది. ఇక ఏపీలో పోలవరం ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి. ఇలావుండగా ఇంద్రావతిలో లభ్యత నీటిని ఛత్తీస్‌గఢ్ పూర్తిస్థాయిలో వినియోగించుకోలేక పోవడంతో.. ఈ నీటిని మిగులు జలాలుగా గుర్తించిన కేంద్రం.. నదుల అనుసంధాన ప్రతిపాదనలు చేసింది. ఇంద్రావతి బేసిన్‌లో ఛత్తీస్‌గఢ్ (అప్పటి మధ్యప్రదేశ్)కు గోదావరి ట్రిబ్యునల్ కేటాయించిన నీటిలో వాడుకోని 141.4 టీఎంసీలకు మరో 106 టీఎంసీల వరద జలాలను జతచేసి మొత్తం 247 టీఎంసీలను ఇచ్చంపల్లి%-%నాగార్జునసాగర్%-%సోమశిల మీదుగా కావేరి గ్రాండ్ ఆనకట్ట వరకు తరలించేలా నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) తొలుత ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

అయితే గోదావరిలో మిగులు, వరద జలాల నీటి లభ్యతను శాస్త్రీయంగా తేల్చేవరకు అనుసంధానం




పక్కన పెట్టాలని తెలంగాణ, ఏపీలు డిమాండ్ చేస్తూ వచ్చాయి. దీంతో తొలిదశ కింద ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 141.3 టీఎంసీలనే గోదావరి%-%కావేరి అనుసంధానంలో భాగంగా ఇచ్చంపల్లి నుంచి నీటిని తరలించేలా ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. ఆవిరి, ప్రవాహ నష్టాలు పోను ఏపీకి 41.8, తెలంగాణకు 42.6, తమిళనాడు 38.6, పుదుచ్చేరికి 2.2, కర్ణాటకకు 9.8 టీఎంసీలు ప్రతిపాదించింది. దీనిపై ఛత్తీస్‌గఢ్ సర్కార్ తీవ్ర అభ్యంతరం తెలిపింది.

చెప్పినట్టే చేస్తున్న ఛత్తీస్‌గఢ్

తమకు హక్కుగా సంక్రమించిన నీటిని తరలించుకు పోతామంటే ఒప్పుకునేది లేదని, భవిష్యత్తులో ఈ నీటిని వినియోగించుకునేలా తాము ప్రాజెక్టులు చేపడతామని ఛత్తీస్‌గఢ్ తెగేసి చెప్పింది. ఈ క్రమంలోనే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం బోధ్‌ఘాట్ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్రం ముందుంచింది.

ఈ ప్రాజెక్టు కింద ఇందాౖవతి నీటిని ఒడిసిపట్టేలా రూ.29 వేల కోట్లతో బోధ్‌ఘాట్ ఆనకట్టని, అదనంగా మరో రూ.20 వేల కోట్లతో మహానది%-%ఇంద్రావతి లింక్‌ను చేపట్టనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 300 మెగావాట్ల విద్యుదుత్పత్తితో పాటు దంతెవాడ, సుక్మా, బీజాపూర్ జిల్లాల్లోని 359 గ్రామాల పరిధిలోని 3.78 లక్షల హెక్టార్లకు (9.45 లక్షల ఎకరాలకు) సాగునీటిని అందించాలని నిర్ణయించింది. అదనంగా తాగు, పారిశ్రామిక అవసరాలకు నీటిని ఇచ్చేలా ప్రణాళికలు ఉన్నాయి.

**గోదావరి-కావేరి అనుసంధానం కూడా ప్రశ్నార్థకమే..!**

ఇంద్రావతి మెజారిటీ జలాలను ఛత్తీస్‌గఢ్ వినియోగించుకునే పక్షంలో గోదావరి నుంచి తెలంగాణ, ఏపీ ప్రాజెక్టులకు నీటి లభ్యత తగ్గడం ఖాయమని నీటి పారుదల నిపుణులు అంటున్నారు. అలాగే కేంద్రం ప్రతిపాదిస్తున్న నదుల అనుసంధానం కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని చెబుతున్నారు. కాగా దీనిపై తెలుగు రాష్ట్రాలు ఎలా స్పందిస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

## సన్నాల బోనస్ విడుదల చేయాలి

-మొదటిపేజీ తరువాయి

రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. ఈ పంట కొనుగోలు పూర్తయి 75 రోజులు దాటినా రైతుల ఖాతాలో డబ్బులు జమ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క సిద్దిపేట జిల్లాలోనే 50% మంది రైతులకు డబ్బులు ఇవ్వలేదు. అన్నదాతల పట్ల రేవంత్‌రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి ఇది అద్దం పడుతోంది. ఇప్పటికైనా స్పందించి వెంటనే పొద్దుతిరుగుడు పంటకు డబ్బులు, సన్నాలకు బోనస్ విడుదల చేయాలి' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## వ్యవసాయంలోనూ ఏఐ

-మొదటిపేజీ తరువాయి

తెలిపారు. వ్యవసాయ యోగ్యమైన భూమి, సీజన్ల వారీగా పంటల విస్తీర్ణం, చీడపీడల గుర్తింపులో మనుషుల వాడకాన్ని తగ్గించి సాంకేతికతను వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ వానాకాలం సీజన్ నుంచే ప్రయోగాత్మకంగా దీనిని ప్రారంభిస్తామని చెప్పారు. ఈ విషయంపై సచివాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. తెలంగాణ విశ్వవిద్యాలయ అగ్రోనమి ప్రొఫెసర్ నీలిమ తాను మూడేళ్లుగా ఏఐ వినియోగంపై చేస్తున్న పరిశోధనలను మంత్రికి వివరించారు. ఇక్రిశాట్ ప్రతినిధులు ఉపగ్రహ ఛాయాచిత్రాల ఆధారంగా వివిధ రాష్ట్రాలకు అందిస్తున్న సేవలు, పంటల సాగు విస్తీర్ణ అంచనా పద్ధతులను వెల్లడించారు. అగ్రివాస్ ప్రతినిధులు పంటలకు సోకే తెగుళ్లు, నీటి ఎద్దడి పరిస్థితుల అంచనాకు ఉపగ్రహ ఆధారిత పరిజ్ఞానం వినియోగం గురించి తెలిపారు. సమావేశంలో వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావు, సంచాలకుడు గోపి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కుర్చీలో రేవంత్‌ను చూడలేకపోతున్నారు

హైదరాబాద్




ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విషయం తక్కువ.. విషం ఎక్కువ అంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కౌంటర్ ఇచ్చారు. హరీష్‌రావుకు కంటెంట్ తక్కువ.. ఆవేశం ఎక్కువ అంటూ సెటైర్లు వేశారు. నీళ్ళు అనే పదంతో బీఆర్ఎస్ రాజకీయం చేసిందని, బీఆర్ఎస్ నేతలు బేసిక్ నాలెడ్జ్ తో ప్రాజెక్టులు కడితే బాగుండేదని ఎద్దేవా చేశారు. వాళ్ల మామ కేసీఆర్‌ను హరీస్‌రావు విలన్ చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం కూలిన తర్వాత తెలంగాణ ప్రజలకు నీళ్ల సంగతి పూర్తిగా అర్థమైంది. కేసీఆర్‌కి ఉన్న అపరజ్ఞానం వల్లే కాళేశ్వరం కూలేశ్వరం అయ్యింది. హరీష్ వైఖరి వల్లే ఏపీ నేతలు బనకచర్లకు నీళ్ళు తరలించుకుందామనే ఆలోచన చేశారు..గోదావరి జలాలపై గొంతు చించుకునే బీఆర్ఎస్ నేతలు.. కృష్ణా జలాలపై ఎందుకు మాట్లాడరు?, హరీష్ రావుకి కంటెంట్ కంటెంట్ తక్కువ.. ఆవేశం ఎక్కువ. సీఎం కుర్చీలో రేవంత్‌ను బీఆర్ఎస్ నేతలుచూడలేకపోతున్నారు. నది జలాలు ఎవరి అయ్యా జాగీరు కాదని హరీష్ తెలుసుకోవాలి. నీళ్ళ అంశంపై తనకి తన మామకి తప్పా ఎవరికీ ఏం తెలియదని హరీష్ అనుకుంటున్నారు. తెలంగాణ నీటిని ఏపీకి దారాదత్తం చేసిందే కేసీఆర్. హరీష్ ఇరిగేషన్ మినిష్టర్ గా ఉన్నప్పుడే ఈ పంచాయితీ మొదలైంది. బనకచర్ల విషయంలో కేంద్రం వినకపోతే సుప్రీంకోర్టు మెట్లు ఎక్కుతామని ప్రకటించిన రేవంత్ రెడ్డి కమిట్మెంట్ అర్థం చేసుకోవచ్చు. బనకచర్లపై ఏకగ్రీవ తీర్మాణం చేద్దామనీ అనుకునే సమయానికి ఆల్ పార్టీ మీటింగ్ నుండి బీఆర్ఎస్ ఎంపీ వాకౌట్ చేసారు. బేస్ వదిలి దోచుకునే ప్రయత్నం చేశారు కాబట్టే తెలంగాణ ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారు. బేసిక్స్ కాదు మాకు ఎథిక్స్ ఉన్నాయి కాబట్టే ప్రజలు మాకు పట్టం కట్టారు' అని ఎంపీ చామల కిరణ్ స్పష్టం చేశారు.

## రైతు రాజ్యం నిధులు విడుదల

-మొదటిపేజీ తరువాయి

సొమ్ముతో కలిపి రైతుభరోసా కింద మొత్తం రూ.21 వేల కోట్ల పెట్టుబడి సాయంతో కొత్త రికార్డు నెలకొల్పినట్లు వివరించింది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రూ.20,616 కోట్ల పంట రుణాలను మాఫీ చేసినట్లు తెలిపింది. రైతు సంక్షేమం కోసం గత 18 నెలల్లో నిధుల వ్యయం వివరాలను 'రైతు రాజ్యం' పేరిట నివేదికగా ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. "దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత తక్కువ కాలంలో... ఇంత పెద్దమొత్తం ఖర్చు చేసిన దాఖలాలు లేవు. గతంలో రూ.లక్ష రుణమాఫీకి నాలుగైదు విడతలుగా అరకొరగా నిధులు విడుదల చేయటంతో.. రైతులపై వడ్డీల భారం తడిసి మోపెడైంది. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లయినా అన్నదాతల అప్పు తీరలేదు. మా ప్రభుత్వం తొలి ఏడాదిలోనే ఏకకాలంలో రూ.2 లక్షల్లోపు మాఫీ చేసి.. 25 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసింది" అని నివేదికలో ప్రభుత్వం పేర్కొంది.

**రైతు రాజ్యం నివేదికలోని ముఖ్యాంశాలు..**

"ఈ నెల 16 నుంచి ఐదు రోజుల్లో రూ.7,310.59 కోట్ల రైతు భరోసా సొమ్మును 65.12 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశాం. తొమ్మిది రోజుల్లో రూ.9,000 కోట్లు జమ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలతో ఆర్థిక, వ్యవసాయ శాఖలు పంపిణీని వేగంగా పూర్తి చేస్తున్నాయి. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తు అందిస్తున్నాం. 29 లక్షల పంపుసెట్లకు ఉచిత కరెంటు సరఫరాకు రూ.16,691 కోట్ల సబ్సిడీని విద్యుత్తు సంస్థలకు చెల్లించాం.

రూ.29,562 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేశాం. వడ్లు అమ్మిన 21.59 లక్షల మంది రైతుల ఖాతాల్లో 48 గంటల్లోనే డబ్బులు జమ చేశాం. 2023-24లో 15 లక్షల మంది రైతుల నుంచి 95.31 లక్షల టన్నుల ధాన్యాన్ని రూ.20,964 కోట్లతో సేకరించాం.

సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ప్రకటించడంతో రాష్ట్రంలో సన్నాల సాగు, దిగుబడి గణనీయంగా పెరిగింది. యాసంగి సీజన్‌లో దొడ్డు రకం 80.56 లక్షల టన్నులు, సన్న రకం 46.96 లక్షల టన్నులు పండాయి. ఈ ఏడాది వరి సాగులో తెలంగాణ కొత్త రికార్డు నెలకొల్పింది. 2.80 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడితో దేశంలో అగ్రస్థానంలో నిలిచింది.

అకాల వర్షాలు, వరదలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.260 కోట్ల పంట నష్టపరిహారం చెల్లించాం.

గత కొన్నేళ్లుగా రాష్ట్రం మ్యాచింగ్ గ్రాంటు విడుదల చేయకపోవడంతో నిలిచిపోయిన 16 కేంద్ర ప్రాయోజిత పథకాల పునరుద్ధరణకు ప్రభుత్వం దాదాపు రూ.245 కోట్లు వెచ్చించింది.

ఆయిల్‌పామ్ సాగులో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 2025 మార్చి వరకు 60,432 ఎకరాల్లో పంట వేశారు. గతంలో గెలల ధర టన్నుకు రూ.12,534 ఉండగా.. సర్కారు చొరవతో రూ.18,748కి పెరిగింది.

బిందు, తుంపర సేద్య పరికరాలపై పెద్దఎత్తున రాయితీ ఇస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100%, చిన్న, సన్నకారు, బీసీ రైతులకు 90%, ఇతరులకు 80% రాయితీపై డ్రిప్ పరికరాలు.. రైతులందరికీ 75% రాయితీపై స్ప్రింక్లర్లను అందిస్తున్నాం. 2023 డిసెంబరు నుంచి 40,265 మంది రైతులకు రూ.282 కోట్ల విలువైన పరికరాలను అందించాం" అని నివేదికలో రాష్ట్ర ప్రభుత్వం వివరించింది.

## ఏ రాష్ట్రంతోనూ వివాదాలు కోరుకోం

-మొదటిపేజీ తరువాయి

కౌన్సిల్ వంటి మార్గాల్లో కాకుండా.. ఏపీ సీఎం చంద్రబాబు నేరుగా బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ నివేదిక (పీఎఫ్ఆర్)ను కేంద్రానికి సమర్పించడం అభ్యంతరకరం. ఆంధ్రప్రదేశ్ మాకు దిగువన ఉంటే.. మేం కర్ణాటక, మహారాష్ట్రలకు దిగువన ఉన్నాం. ఏ రాష్ట్రంతోనూ మేం వివాదాలు కోరుకోవడంలేదు. అదే సమయంలో తెలంగాణ హక్కులనూ వదులుకోబోం. మాకున్న అనుమానాలపై చర్చించి పరిష్కరించుకోవాలనుకుంటున్నాం. దీనిపై ఈ నెల 23న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తాం.. అవసరమైతే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని మేమే చర్చలకు ఆహ్వానిస్తాం. ముందు ముఖ్యమంత్రుల స్థాయిలో చర్చించుకొని తర్వాత ఎపెక్స్ కౌన్సిల్‌కు వెళ్తాం.

**భారాస అప్పుడెందుకు మాట్లాడలేదు?**

జలాల తరలింపునకు పునాది పడిందే హరీశ్‌రావు సాగునీటిశాఖ మంత్రిగా ఉన్నప్పుడు. గోదావరి వరద జలాలను రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అవసరాల కోసం తరలించేందుకు డీపీఆర్ తయారు చేసే బాధ్యతను వాప్కోస్‌కు అప్పగిస్తూ 2016 ఏప్రిల్ 16న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో నంబరు 262ను జారీ చేసింది. ప్రకాశం బ్యారేజీ నుంచి పెదగంజాం వయా కమ్మమూర్ కెనాల్ వరకు నీటి తరలింపు, గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి సంగం బ్యారేజీకి వరదజలాల తరలింపు కోసం మరో డీపీఆర్ తయారీ బాధ్యతను అదే వాప్కోస్‌కు అప్పగిస్తూ ఏపీ ప్రభుత్వం 2018 మార్చి 29న జీవోఆర్‌టీ నం.230 విడుదల చేసింది. ఆనాడు తెలంగాణ నీటిపారుదల మంత్రిగా ఈ జీవోల గురించి నోరెత్తని హరీశ్‌రావు.. ఇప్పుడు పెద్దపెద్ద ఉపన్యాసాలిస్తున్నారు. గోదావరి నుంచి పెన్నా పరీవాహక ప్రాంతానికి 400 టీఎంసీల నీరు తరలించడానికి నాలుగు ప్రత్యామ్నాయాలను వాప్కోస్ డీపీఆర్‌లో సూచించింది. బనకచర్ల.. పెన్నా బేసిన్‌లో ఒక భాగమే. కానీ ఆ డీపీఆర్ గురించి ఆనాడు భారాస ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అలా దానికి 2016లోనే పునాది పడింది. అదే ఏడాది జరిగిన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనూ గోదావరి జలాల తరలింపునకు అప్పటి సీఎం కేసీఆర్ అంగీకరించారు.

**భారాస కంటే 95 టీఎంసీలు ఎక్కువే అడుగుతున్నాం**

కృష్ణా జలాల్లో మేం 500 టీఎంసీలు అడుగుతుంటే భారాస తప్పు పడుతోంది. కానీ రాష్ట్రానికి 299 టీఎంసీలు చాలని 2015 జూన్ 18, 19 తేదీల్లో జరిగిన కృష్ణా నదీ యాజమాన్యమండలి సమావేశంలో లేఖ రాసి ఇచ్చింది అప్పటి నీటిపారుదల మంత్రి హరీశ్‌రావే. 2020 డిసెంబరు 19న జరిగిన మరో కేఆర్ఎంబీ మీటింగ్‌లోనూ కృష్ణా జలాలను ఏపీ, తెలంగాణల మధ్య 66:33 నిష్పత్తిలో పంచుకోవడానికి అంగీకరించారు. 2020 డిసెంబరు 22న జరిగిన ఎపెక్స్ కమిటీ సమావేశంలో.. కేడబ్ల్యూడీటీ-2 తీర్పు నోటిఫై చేసేంతవరకూ కేడబ్ల్యూడీటీ-1 తీర్పు ప్రకారం ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీల మేర పంపిణీ చేయడానికి అంగీకరించింది కూడా కేసీఆరే. అయితే అప్పటివరకు తాము చెప్పింది తప్పని గుర్తించి.. కృష్ణా జలాలను ఏపీ, తెలంగాణల మధ్య 50:50 నిష్పత్తిలో పంపిణీ చేయాలని 2023 జులై 10వ తేదీన హరీశ్‌రావు రాష్ట్ర ఆర్థికమంత్రి హోదాలో కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు లేఖ రాశారు. దాని ప్రకారం.. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన 811 టీఎంసీల్లో 50% అంటే 405.5 టీఎంసీలే. మేం అంతకంటే దాదాపు 95 టీఎంసీలు ఎక్కువగా.. 500 టీఎంసీలు ఇవ్వాలని అడుగుతున్నాం. ఇప్పుడు దీన్ని తప్పుబట్టే వారిని ఏమనాలి? ఈ విషయంలో తీసేసిన తహసీల్దార్లు చేసే విమర్శలను నేను పట్టించుకోను.

**ఆ విషయం వారికే తెలియాలి**

తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ అనుమతులు తీసుకుందా? అని కొందరు అడుగుతున్నారు. అది పాత ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టే. కేసీఆర్ దాని డిజైన్ మార్చి కాళేశ్వరం కట్టారు. దానిపై అప్పట్లో ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించారా? లేదా? అన్నది కేసీఆర్, చంద్రబాబునాయుడు, జగన్‌మోహన్‌రెడ్డిలకే తెలియాలి.

**భారాస రుణాన్ని భాజపా తీర్చుకుంటోంది**

మోదీకి చంద్రబాబునాయుడు సీట్లు కావాలి. చంద్రబాబు మరోసారి గెలవడానికి బనకచర్ల ప్రాజెక్టు కావాలి. కేసీఆర్ తన పార్టీని బతికించుకోవడానికి ఈ వివాదం కావాలి. గత పార్లమెంటు ఎన్నికల్లో భారాస అవయవదానం మాదిరి.. తన సీట్లు త్యాగం చేసి భాజపాను గెలిపించింది. కేసీఆర్, హరీశ్‌రావులు ప్రాతినిధ్యం వహించే మెదక్ సీటును కూడా కట్టబెట్టింది. ఆ రుణం తీర్చుకోవడానికి ఇప్పుడు కిషన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు.

# ప్రజాసేవ చేయకపోతే ప్రశాంతంగా నిద్రించలేను

సివాన్

నిత్యం ప్రజాసేవ చేయకపోతే ప్రశాంతంగా నిద్రించలేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాత్రి పగలు ప్రజల కోసమే పని చేస్తున్నానని చెప్పారు. ఆయన శుక్రవారం బిహార్, ఒడిశాలో పర్యటించారు. తొలుత బిహార్‌లోని సివాన్ జిల్లాలో రూ.5,900 కోట్లకుపైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. బిహార్‌లోని పాటలీపుత్ర జంక్షన్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ వరకు నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. విపక్ష రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ), కాంగ్రెస్‌లపై విరుచుకుపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఆర్జేడీ అవమానించిందని ఆరోపించారు. వారసత్వ రాజకీయాలను అంబేడ్కర్ వ్యతిరేకించారని గుర్తుచేశారు. అందుకే అంబేడ్కర్ అంటే ఆర్జేడీ, దాని మిత్రపక్షాలకు ఇష్టం లేదన్నారు. బాబాసాహెబ్ చిత్రపటాన్ని ఆర్జేడీ నేతలు పాదాలతో తొక్కేశారని, దీనిపై క్షమాపణ చెప్పాలని ప్రజలు డిమాండ్ చేస్తే ఏమాత్రం స్పందించలేదని మండిపడ్డారు. అంబేడ్కర్ కంటే తామే గొప్పవాళ్లమని ఆర్జేడీ%–%కాంగ్రెస్ నాయకులు అహంకారం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. అంబేడ్కర్ తన హృదయంలో ఉన్నాడని, ఆయన చిత్రపటాన్ని గుండెకు హత్తుకోవడం తనకు ఇష్టమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆర్థిక వనరులు కొల్లగొట్టడానికి ఆర్జేడీ, కాంగ్రెస్ కాచుకొని



కూర్చున్నాయని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ కూటమిని చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

**అభివృద్ధి కోసం శ్రమిస్తున్నాం**

“భారతదేశ ప్రగతిని చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోతున్నాయి. నిన్ననే విదేశాల నుంచి తిరిగొచ్చా. విదేశీ పర్యటనలో ఉన్నప్పుడు అక్కడి నేతలు మన దేశ అభివృద్ధిని ప్రత్యేకంగా ప్రశంసించారు. పేదల సాధికారతకు ఎదురవుతున్న అడ్డంకులను ఎన్డీయే ప్రభుత్వం తొలగిస్తోంది. గత 11 ఏళ్లుగా ప్రజాసేవలో నిమగ్నమయ్యాం. అభివృద్ధి కోసం అహోరాత్రులూ శ్రమిస్తున్నాం. బిహార్‌లో మళ్లీ జంగిల్‌రాజ్ రావొద్దంటే విపక్ష ఇండియా కూటమి ఓడించాలి. ఎన్డీయే నినాదం సబ్‌కా సాత్, సబ్‌కా విశ్వాస్. విపక్ష కూటమి నినాదం పరివార్‌కా సాత్, పరివార్‌కా వికాస్. సొంత కుటుంబాల అభివృద్ధి తప్ప ప్రజలంటే వారికి లెక్కలేదు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగ స్ఫూర్తికి ఇది విరుద్ధం కాదా?” అని ప్రధాని మోదీ ప్రశ్నించారు.

**భువనేశ్వర్‌లో తిరంగా యాత్ర**

ప్రధాని మోదీ ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో తిరంగా యాత్ర, రోడ్‌షోలో పాల్గొన్నారు. ఎయిర్‌పోర్టు నుంచి జనతా మైదాన్ వరకు 9 కిలోమీటర్ల మేర జరిగిన ఈ యాత్రలో వేలాది మంది ప్రజలు భాగస్వాములయ్యారు. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం పూర్తయిన సందర్భంగా తిరంగా యాత్ర నిర్వహించారు. రూ.18,600 కోట్లకుపైగా విలువైన 105 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు.

**ట్రంప్ ఆహ్వానం తిరస్కరించా..**

వాషింగ్టన్‌లో పర్యటించాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానించగా, తాను తిరస్కరించానని ప్రధాని మోదీ చెప్పారు. వాషింగ్టన్ పర్యటనకు బదులు ఒడిశాను ఎంచుకున్నానని తెలిపారు. భువనేశ్వర్ సభలో ఆయన మాట్లాడారు. “జీ7 సదస్సు కోసం కెనడా వెళ్లినప్పుడు ట్రంప్ నాతో ఫోన్‌లో మాట్లాడారు. వాషింగ్టన్‌కు రావాలంటూ ఆహ్వానించారు. చర్చించుకుందామని, కలిసి భోజనం చేద్దామని అన్నారు. ఆహ్వానించినందుకు ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలియజేశా. జగన్నాథుడు కొలువుదీరిన ఒడిశాకు వెళ్లాల్సి ఉందని చెప్పా. వాషింగ్టన్‌కు రాలేనంటూ ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించా” అని ప్రధానమంత్రి వెల్లడించారు.

# యోగీ సర్కార్ లిస్ట్ మాములుగా లేదే

**లక్నో :** 2017లో బీజేపీ ఉత్తరప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చింది. యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రి అయ్యారు. అప్పటి నుంచి ఉత్తరప్రదేశ్ అంతటా పోలీసు ఎన్‌కౌంటర్లలో గణనీయమైన పెరుగుదల ఉందని ఇటీవలి డేటా వెల్లడిస్తోంది. ఈ ఆపరేషన్లలో అనేక మంది నేరస్థులు హతమయ్యారు. అలాగే వేల సంఖ్యలో పలువురు గాయపడ్డారు. అయితే తాజాగా మొట్ట మొదటిసారి ఉత్తరప్రదేశ్ పోలీసులు గత ఎనిమిది సంవత్సరాలుగా రాష్ట్ర నేర నిరోధక కార్యకలాపాలపై సమగ్ర డేటాను విడుదల చేశారు. యాక్టింగ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) రాజీవ్ కృష్ణ విడుదల చేసిన డేటా ప్రకారం.. 2017 నుంచి 2024 మధ్య పోలీసు ఎన్‌కౌంటర్లలో మొత్తం 234 మంది కరడుగట్టిన నేరస్థులు హతమయ్యారు. అదనంగా ఈ ఘర్షణల్లో 9,202 మంది నేరస్థులు గాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నేరాలకు వ్యతిరేకంగా కఠినమైన జీరో–టాలరెన్స్ విధానాన్ని అమలు చేసింది. గత ఎనిమిది సంవత్సరాలలో ఉత్తరప్రదేశ్ అంతటా 14,741 ఎన్‌కౌంటర్ సంఘటనలు జరిగాయి. ఈ ఆపరేషన్లలో 30,293 మంది నేరస్థులు అరెస్టు అయ్యారు. అయితే ఎన్‌కౌంటర్ ఆపరేషన్స్ సమయంలో పోలీసులు



కూడా మరణించారు. విధి నిర్వహణలో నేరస్థులతో పోరాడుతున్నప్పుడు 18 మంది పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. అలాగే 1,700 మంది పోలీసులు గాయపడ్డారు. డేటా ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా చూసుకుంటే మీరట్ జోన్‌లో అత్యధికంగా ఎన్‌కౌంటర్‌లు జరిగాయి. మొత్తం 4,183 ఆపరేషన్లలో 7,871 మంది నేరస్థులు అరెస్టు అయ్యారు. 2,839 మంది గాయపడ్డారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో 77 మంది భయంకరమైన నేరస్థులు మరణించారు. అలాగే ఇద్దరు పోలీసులు వీరమరణం పొందగా, 452 మంది గాయపడ్డారు. వారణాసిలో 1,041 ఎన్‌కౌంటర్‌లలో 2,009 మంది నేరస్థులను అరెస్టు చేశారు. 605 మంది గాయపడ్డారు, 26 మంది మరణించారు. 96 మంది పోలీసు అధికారులు గాయపడ్డారు. అలాగే ఆగ్రా జోన్‌లో 2,288 ఎన్‌కౌంటర్ సంఘటనలు జరిగాయి. దీని ఫలితంగా 5,496 మంది నేరస్థులు అరెస్టు అయ్యారు, 715 మంది గాయపడ్డారు. 19 మంది మరణించారు. ఎన్‌కౌంటర్ సమయంలో 56 మంది పోలీసులు కూడా గాయపడ్డారు.

# మేం నీళ్లెందుకు ఇవ్వాలి?
# కెనాల్ ప్లాన్‌ను వ్యతిరేకించిన ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్ జలాలను ఉత్తరాది రాష్ట్రాలకు అనుసంధానించే కెనాల్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వ్యతిరేకించారు. మొదట తమ జలాలను తాము వాడుకోవాలని, జమ్మూలో కరవు తరహా పరిస్థితి ఉందని, తామెందుకు పంజాబ్‌కు జలాలు పంపాలని ఆయన ప్రశ్నించారు. సింధు జాలాల వ్యవస్థ నుంచి జమ్మూకశ్మీర్ షేర్‌లోని మిగులు జలాలను పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌కు మళ్లించేందుకు 113 కిలోమీటర్ల కెనాల్ ప్రాజెక్టుకు ప్లాన్ జరుగుతోంది. దీనిపై ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ, సింధు జలాల ఒప్పందం కింద పంజాబ్ ఇప్పటికే జలాలు పొందుతోందని చెప్పారు. ‘మాకు అవసరమైతే వాళ్లు నీళ్లిస్తారా?’ అని ప్రశ్నించారు. పఠాన్‌కోటలో షాపుర్‌కండి ఆనకట్ట నిర్మాణానికి సంబంధించి 45 ఏళ్లుగా పంజాబ్, జమ్మూకశ్మీర్ ప్రభుత్వాల మధ్య



వివాదం కొనసాగుతోంది. 1979లో రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగినా కేంద్రం మధ్యవర్తిత్వంలో 2018లోనే ఇది కార్యరూపం దాల్చింది. పాత వివాదాన్ని ఒమర్ అబ్దుల్లా ప్రస్తావిస్తూ, సింధు జలాల ఒప్పందం కింద ఇప్పటికే పంజాబ్‌కు నీళ్లందుతున్నాయని, మాకు అవసరమైనప్పుడు వాళ్లు నీళ్లిస్తారా అని ప్రశ్నించారు. తమను చాలా ఏళ్లుగా కంటతడిపెట్టేలా వాళ్లు (పంజాబ్) చేశారని, ఇప్పుడు ముందుగా మేము జలాలు వాడుకుని, ఇతరుల గురించి ఆలోచిస్తామని చెప్పారు. కాగా, సింధు జలాల ఒప్పందం కింద పాకిస్థాన్‌కు ఉద్దేశించిన జలాలను పంజాబ్, రాజస్థాన్, హర్యానాకు మళ్లించాలని కేంద్రం నిర్ణయించినట్టు పలు మీడియాలో ఇటీవల కథనాలు వచ్చాయి. ఈ నిర్ణయాన్ని యుద్ధప్రాతిపదికన అమలు చేసేందుకు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై జలశక్తి మంత్రి ఇప్పటికే దృష్టి సారించారని చెబుతున్నారు. పాకిస్థాన్‌కు వెళ్లే చుక్కనీరు కూడా వృథా కారాదని మంత్రిత్వ శాఖ పట్టుదలగా ఉందని చెబుతున్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాక్‌పై కఠిన చర్యల్లో భాగంగా సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసింది.

## ‘మరో లిబియా’ కావద్దనే..!
# ట్రంప్ వెనకడుగుకు కారణం ఇదేనా?

**ఇంటర్నెట్ డెస్క్:** ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధంలో అగ్రరాజ్యం జోక్యం చేసుకోవడంపై చర్చ జరుగుతున్న వేళ.. రెండు వారాల్లోపు అధ్యక్షుడు దీనిపై నిర్ణయం తీసుకుంటారని వైట్‌హౌస్ నుంచి కీలక ప్రకటన వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ఇరాన్‌పై సైనిక చర్య చేపట్టే విషయంలో డొనాల్డ్ ట్రంప్ (%ఇశీఞఖ్రీశ ుతీబవెజూ%) ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ తాము రంగంలోకి దిగితే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని.. ఇరాన్ కూడా మరో లిబియా మాదిరిగా మారవచ్చనే ఆందోళన ట్రంప్ వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఆఫ్రికా దేశమైన లిబియాలో పాలన మార్పునకు మద్దతిచ్చిన అమెరికా గతంలో సైనిక చర్య చేపట్టింది. దీంతో 2011లో గడాఫీ ప్రభుత్వం అంతమైంది. కానీ, అప్పటి నుంచి లిబియా అంతర్యుద్ధంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ క్రమంలో ఒకవేళ ఇరాన్ యుద్ధంలోనూ జోక్యం చేసుకొని సుప్రీం లీడర్ ఖమేనీని తప్పిస్తే పరిస్థితులు తీవ్ర గందరగోళంగా మారుతాయని ట్రంప్ ఆలోచిస్తున్నట్లు అంతర్జాతీయ వార్తా కథనాలు



పేర్కొన్నాయి. ఇరాన్ మరో లిబియాగా మారొద్దని అధ్యక్షుడు కోరుకుంటున్నారని, అలా జరిగితే దీర్ఘకాలం అనిశ్చితికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు అధ్యక్షుడి సన్నిహిత వర్గాలు చెప్పినట్లు తెలిపాయి. ఇజ్రాయెల్ ఇటీవల దాడులు మొదలుపెట్టకముందే ఇరాన్ పరిస్థితిపై ట్రంప్ చాలా ఆందోళన వ్యక్తం చేశారని సమాచారం. అంతేకాదు.. అఫ్గానిస్థాన్, ఇరాక్‌ల ప్రస్తావన తెచ్చిన ఆయన.. అమెరికా సైనిక చర్యతో ఈ రెండు దేశాలు దీర్ఘకాలంగా అస్థిరత్వాన్ని ఎదుర్కొంటున్నట్లు చెప్పినట్లు తెలిసింది. ఒకవేళ ఇరాన్‌పై దాడులు చేసినా.. అణుకేంద్రాలపై గగనతల దాడులు పరిమిత స్థాయిలోనే ఉండవచ్చని ట్రంప్ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ అమెరికా దాడుల్లో ఇరాన్ ప్రభుత్వం కూలిపోతే ట్రంప్ యంత్రాంగాన్ని నిందించవద్దని వైట్‌హౌస్ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. ఖమేనీ పాలనను అంతం చేయడం తమ ఉద్దేశం కాదని, కేవలం అణు స్థావరాలే తమ లక్ష్యమని చెప్పినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే స్పందించిన వైట్‌హౌస్.. శాంతి చర్చల కోసం ద్వారాలు తెరిచే ఉన్నాయని, ఇందు కోసం రెండు వారాల గడువు ఇస్తున్నట్లు ప్రకటన చేసింది. నిర్ణయం తీసుకునే ముందు ట్రంప్ అనేక కోణాల్లో ఆలోచిస్తున్నారని, ప్రపంచ నేతల మాటలతోపాటు అమెరికా ప్రజలు, సలహాదారుల సూచనలను ఆయన పరిగణనలోకి తీసుకుంటున్నారని తెలిపింది.

## మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

**భద్రతా దళాలు, అనుమానిత కుకీ ఉగ్రవాదుల మధ్య జరిగిన ఎదురుకాల్పులు**



చురాచంద్‌పూర్/బిష్ణుపూర్

మణిపూర్‌లో మళ్లీ అశాంతి చెలరేగింది. గురువారం చురాచంద్‌పూర్ జిల్లాలోని చింగ్‌ఫీ గ్రామంలో భద్రతా దళాలు, అనుమానిత కుకీ ఉగ్రవాదుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో కుకీ వర్గానికి చెందిన ఒక మహిళ మరణించింది. ఆ తర్వాత బిష్ణుపూర్ జిల్లాలోని ఫుబాలా గ్రామంలో కాల్పుల్లో ఒక మైతేయి రైతు గాయపడ్డాడు. ఈ సంఘటనలతో ఈ ప్రాంతంలో మళ్లీ జాతుల మధ్య ఉద్రిక్తతలు ప్రారంభమయ్యాయి. ఇరువర్గాలు నిరసనలకు పిలుపునిచ్చాయి. పోలీసులు, అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, గురువారం మధ్యాహ్నం 3:30 గంటలకు బిష్ణుపూర్%–%చురాచంద్‌పూర్ సరిహద్దులో ఉన్న లోతట్టు గ్రామమైన ఫుబాలా వద్ద సాయుధులు కాల్పులు జరిపారు. పక్కనే ఉన్న కొండలలో నుంచి పొలాల్లో పనిచేస్తున్న రైతులపై అనేక రౌండ్లు కాల్పులు జరిపారు. మైతేయి రైతు 60 ఏళ్ల నింగ్తౌజామ్ బిరెన్ ఎడమ చేతికి గాయమైంది. వెంటనే బిష్ణుపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. దాడి తరువాత, భద్రతా దళాలు సమీపంలోని చింగ్ఫీ గ్రామంలో ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో అను మానిత ఉగ్రవాదులతో ఎదురుకాల్పులు జరిగా యి. ఈ కాల్పుల్లో చురాచంద్‌పూర్‌లోని లాంగ్‌చింగ్‌మాన్‌బి గ్రామ అధిపతి ఖైఖోగిన్ హావోకిప్ భార్య హెూయిఖోల్హింగ్ హావోకిప్ బుల్లెట్ తగిలి మరణించింది.

## అంధ విద్యార్థుల పాట విని..
## పుట్టినరోజున రాష్ట్రపతి ముర్ము కంటతడి



దిల్లీ, దేహ్రాదూన్

తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ అంధ విద్యార్థులు ఆలపించిన గీతం విని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. చిన్నారులు “బార్‌బార్ దిన్ యే ఆయే.. తుమ్ జియో హజారో సాల్” గీతాన్ని ఆలపిస్తుండగా ముర్ము కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటన ఉత్తరాఖండ్ రాజధాని దేహ్రాదూన్‌లో జరిగింది. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆమె దేహ్రాదూన్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా అక్కడి అంధుల పాఠశాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ముర్ము పాల్గొన్నారు. శుక్రవారం ముర్ము 67వ పుట్టినరోజు కావడంతో ఆమె కోసం చిన్నారులు గీతాన్ని ఆలపించారు. దీంతో భావోద్వేగానికి గురైన ఆమె తర్వాత మాట్లాడుతూ.. తన ప్రజా జీవితంలో గుర్తుండిపోయే క్షణాల్లో ఇది ఒకటన్నారు. “నేను కన్నీళ్లను ఆపుకోలేకపోయాను. వారు ఎంతో అందంగా పాడారు” అని ముర్ము అన్నారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రాష్ట్రపతి ముర్ము జన్మదినం సందర్భంగా ప్రధాని మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆంగ్ల భాష సిగ్గుచేటు కాదు..
## విద్యార్థుల అభివృద్ధికి ఊతం

దిల్లీ



ఆంగ్ల భాష సిగ్గుచేటు కాదని, విద్యార్థుల సాధికారతకు అది చిహ్నం అని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రతి చిన్నారికి కచ్చితంగా ఆంగ్ల భాషను నేర్పించాలని తెలిపారు. త్వరలోనే దేశంలో ఆంగ్లం మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయంటూ కేంద్ర హెూంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం రాహుల్ స్పందించారు. “ఆంగ్లం డ్యామ్ లాంటిది కాదు..అది ఒక వంతెన. సిగ్గుచేటు కాదు... సాధికారత కల్పించే ఆయుధం. సమస్య కాదు. అడ్డంకులను బద్దలుగొట్టగలిగే సాధనం” అని రాహుల్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. పేదలు ఉన్నత చదువులు చదువుకుని.. సమానత్వాన్ని సాధించడం భాజపా, ఆరెస్సెస్‌లకు ఇష్టం లేదని విమర్శించారు. అందుకే వారిని విద్యకు దూరం చేయాలని అనుకుంటున్నారని మండిపడ్డారు. ప్రతి ఒక్కరికి మాతృభాష ఎంత ముఖ్యమో.. ఆంగ్ల భాష కూడా అంతే అవసరమని పేర్కొన్నారు. భారతదేశంలోని ప్రతి భాషకు ఆత్మ, సంస్కృతి, జ్ఞానం ఉన్నాయని, వాటిని మనం గౌరవించాలన్నారు. అదే సమయంలో ప్రపంచంతో పోటీ పడడానికి వీలుగా ప్రతి చిన్నారికి ఆంగ్ల విద్యను బోధించాలని సూచించారు. ఆంగ్లం ఉపాధిని కల్పిస్తుందని, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని అన్నారు.

# ఆరోగ్యం కోసం యోగాభ్యాసం



అష్టఐశ్వర్యాలు, విలాసవంతమైన సౌకర్యాలు ఎన్ని ఉన్నా ఆరోగ్యం జతకూడని జీవితాలు దుర్భరమే కదా. అనారోగ్యం చుట్టుముట్టినపుడు ఆరోగ్యం ప్రాధాన్యత అవగతం అవుతుంది. లక్షల ఖరీదైన మంచం, పరుపులు ఉన్నప్పటికీ పడుకోగానే నిద్రరాని వారు అభాగ్య నిరుపేదలే అవుతారు. ఔషధాలు కొనవచ్చు కాని, ఆరోగ్యాన్ని కొనలేము అన్నటికీ. ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆరోగ్య సంరక్షణకు గొడుగులు పట్టాలి. నిత్యం ఓ గంట లేదా అరగంట ఆరోగ్య భాగ్యానికి కేటాయించాలి. జ్వరం లేకపోవడం ఆరోగ్యంగా ఉన్నట్లు కాదని తెలుసుకోవాలి. 'యోగా' అనే పదానికి అర్థం 'ఐక్యత' లేదా 'కలయిక' అని తెలుసుకోవాలి. ఒక వ్యక్తి శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా, భావోద్వేగభరితంగా, సామాజికంగా, సాంస్కృతికంగా సమతుల్యంగా ఉన్నపుడే పూర్తి ఆరోగ్యం, శ్రేయస్సు (వెల్-బీయింగ్) ఒనగూడుతుందని ఐరాస - డబ్ల్యూహెచ్ఓ నిర్వచించింది. సనాతన భవ్య భారతానికి సంపూర్ణ ఆరోగ్యాన్ని బహుకరిస్తున్న యోగా నినాదంగా "సర్వే సంతు నిరామయ (రోగాలకు దూరంగా ప్రజానీకం)" ధ్వనిస్తున్నది. సనాతనం భారత నాగరికత ప్రపంచ మానవాళికి అందించిన దివ్య ఆరోగ్య అస్త్రంగా "యోగా ప్రక్రియ" నేడు ప్రపంచవ్యాప్తంగా బహుళ ప్రచారం పొందుతున్నది. శాస్త్రీయ పద్ధతుల్లా శరీర అవయవాల కదలికలు, శ్వాస క్రియలు, ఏకాగ్రతకు ఉపకరించే శారీరక-మానసిక శ్రేయస్సు కోసం పాటించే అభ్యాసాలను వివరించే శాస్త్రమే "యోగా ప్రక్రియ" అని అర్థం చేసుకోవాలి. యోగా ప్రాధాన్యాన్ని గుర్తించిన ఐరాస తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 21 జూన్‌న "అంతర్జాతీయ యోగా దినోత్సవం (ఇంటర్నేషనల్ యోగా డే)" పాటించుట 21 జూన్ 2015 నుంచి ఆనవాయితీగా మారింది. అనారోగ్యాల నుంచి ఆరోగ్యం వైపు, ఆరోగ్యాన్ని ఆలింగనం చేసుకోవడం, మానసిక వికాసం పొందడం, పూర్తి మానవ శ్రేయస్సుకు ఉపకరించడమే లక్ష్యంగా యోగా వినియోగపడుతున్నది. అంతర్జాతీయ యోగా దినోత్సవం-2025 ఇతివృత్తంగా "ఒకే ధరణి, ఒకే ఆరోగ్యం కోసం యోగాభ్యాసం (యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్)" అనబడే అంశాన్ని ఎంపిక చేసి ప్రచారం నిర్వహిస్తున్నారు. పర్యావరణ ఆరోగ్యంతో మానవాళి ఆరోగ్యం ఆధారపడి ఉందని, భూమాతను పరిశుభ్రంగా ఉంచినపుడే జీవకోటి ఆరోగ్యం సిద్ధిస్తుందని మనకు తెలుసు. యోగాభ్యాసం చేసుకుంటూ, భూగ్రహం కాలుష్యాన్ని కట్టడి చేసుకుంటూ మానవాళి ఆయురారోగ్యాలతో జీవితాలను కొనసాగించాలని ఈ వేదిక ప్రచారం చేస్తున్నది. యోగాభ్యాసం ఆచరించిన వారికి శరీర అవయవాలు తేలికగా కదలడం, శరీరం దృఢ పడడం, కండరాలు-కీళ్ల బలపడడం, అవయవ సమతుల్యత/సమన్వయం పెరగడం, హృదయ ఆరోగ్యం మెరుగుపడడం, శ్వాస క్రియ గాడిన పడడం, పలు రకాల నొప్పులు తగ్గడం, జీవనశైలి రుగ్మతలైన బిపీ-షుగర్లు అదుపులో ఉండడం లాంటి శారీరక ప్రయోజనాలు కలుగుతాయి. వీటికి తోడుగా ఒత్తిడి-ఆందోళన-ఆవేదనలు తగ్గడం, మూడ్ స్థిరంగా ఉండడం, నాణ్యమైన నిద్ర రావడం, ఏకాగ్రత-స్పష్టత పెరగడం, భావోద్వేగ నియంత్రణ ఫలించడం, మానసిక ప్రశాంతత ఒనగూడడం లాంటి మానసిక ప్రయోజనాలు యోగాభ్యాసం వల్ల కలుగుతాయి. ఇలా శారీరక సమతుల్యతతో మానసిక సమన్వయం కూడా జతకూడితే పూర్తి శ్రేయస్సు కలుగుతుందనితెలుసుకోవాలి. వీటికి తోడుగా యోగా బోధనలో భాగంగా కాలుష్యరహిత జీవన విధానం కూడా పరిచయం చేయడం జరుగుతుందని తెలుసుకోవాలి. ఎముకలకు సంబంధించిన చికిత్సలు, స్ట్రోక్ రికవరీ, దీర్ఘకాలిక బెడ్ రెస్ట్ తీసుకోవడం, నొప్పులకు వైద్యం, క్యాన్సర్ రికవరీ, ప్రసవం అయిన అనారోగ్య తల్లులు లాంటి వారు పరిమిత స్థాయిలో నిపుణుల సమక్షంలో యోగా పాటిస్తే ఆరోగ్యం మెరుగు పడుతుందని తెలుసుకోవాలి. తొలిసారి యోగా చేస్తున్న వ్యక్తులకు పరిచయం చేసే యోగాసన ప్రక్రియల్లో తాడాసనా, బాలాసనా, భుజంగాసనా, మార్జరియాసన-బిటిలాసనా, సుఖాసనా, సేతుబంధాసనా లాంటివని బహుళ ప్రచారం పొందాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేదికగా స్థానికంగా యోగా శిబిరాల నిర్వహణ, ఆన్‌లైన్ తరగతులు, హరిత యోగా, మాస్ యోగా, శ్వాసక్రియ అభ్యాసాలు, యోగా ప్రయోజనాల పట్ల అవగాహనలు-కార్యశాలలు-సదస్సులు, యోగా ప్రక్రియలో దాగిన అనంత శక్తిని వివరించడం లాంటి కార్యక్రమాలను నిర్వహించాలి. రోజూ గంట తరబడి సమయం వెచ్చించాల్సిన పని లేదని, కనీసం 30 నిమిషాల యోగా ఏకాగ్రత సరిపోతుందని మనందరం తెలుసుకోవాలి. ఒకే సారి ఒక భంగిమ, ఒక శ్వాస, ఒక కదలిక చేయడమే యోగా ప్రక్రియకు పునాది. ఆరోగ్యకర ధరణితో మానవుడు స్నేహం చేసినపుడే జీవకోటి సంపూర్ణ ఆరోగ్యం ఫలిస్తుందని తెలుసుకోవాలి. యోగాకు మన జీవనశైలిలో తగు సమయాన్ని ఇవ్వాలి, సంపూర్ణ శ్రేయస్సును పొందాలి.

# మిడిల్ ఈస్ట్ మరో అగ్నిపర్వతం



ఇరాన్, ఇజ్రాయిల్ దేశాల మధ్య నెలకొన్న సుదీర్ఘ శత్రుత్వం తాజాగా మరోసారి మిడిల్ ఈస్ట్ భౌగోళిక, రాజకీయ సమీకరణాలను వణికించే స్థాయికి చేరింది. 2024 ఏప్రిల్‌లో ఇరాన్ తన భూభాగం నుండి నేరుగా ఇజ్రాయిల్‌పై భారీ డ్రోన్, క్షిపణి దాడులకు పాల్పడటం, అనంతరం ఇజ్రాయిల్ కౌంటర్‌స్ట్రైక్స్ చేయడం ద్వారా ఈ ఉద్రిక్తత క్షణాల్లోనే ప్రాదేశిక యుద్ధమవుతుందని ప్రపంచాన్ని కలవర పెట్టింది. ఇజ్రాయిల్‌కి చెందిన అత్యంత కీలకమైన రక్షణ సమాఖ్య అయిన మోసాద్ మాజీ అధికారి ఇలా అన్నారు: "ఇది మిడిల్ ఈస్ట్‌లో రెండో వరల్డ్ వార్‌కి సంకేతం కావొచ్చు. కానీ ఇప్పుడు జరిగేది బాంబులతో కాదు - సంచలనాలతో, మిత్ర శత్రువుల మార్పులతో." ఈ సంఘటనకు తలదన్నేలా 2024 ఏప్రిల్ 13న ఇరాన్ దాదాపు 300కి పైగా డ్రోన్‌లు, క్రూజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులతో ఇజ్రాయిల్‌పై నేరుగా దాడికి దిగింది. ఇదే మొదటిసారి ఇరాన్ తాము అటాక్ చేస్తున్నట్లు ఓపెన్‌గా ప్రకటించి, తాము ప్రత్యక్ష యుద్ధంలో ఉన్నామంటూ ప్రపంచం ముందుకు వచ్చింది. ఇది అంతకుముందు ఏ దేశం చేసిన ధైర్యం కాదు. ఎందుకంటే ఇజ్రాయిల్ ఎప్పుడూ తన ప్రాధాన్యత ఉన్న లక్ష్యాలను విచక్షణ లేకుండా ధ్వంసం చేయడంలో పేరొందింది. అయితే ఈ దాడికి తలకాయగా నిలిచింది ఏప్రిల్ 1న ఇజ్రాయిల్ బెరుత్‌లోని ఇరాన్ దౌత్య కార్యాలయం (డిప్లోమాటిక్ మిషన్) పై జరిపిన గూఢచర్య దాడి. ఆ దాడిలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్‌కి చెందిన కీలక సైనికాధికారులు హతమయ్యారు. దానికే ప్రతీకారంగా ఈ పెద్ద ఎత్తున దాడిని ఇరాన్ ప్రారంభించింది. ఇజ్రాయిల్ దీనికి తక్షణమే సమాధానంగా ఎదురుదాడి చేసి, అంతరిక్షం లోనే వాటిలో 99% క్షిపణులను అడ్డుకోవడంలో విజయవంతమైంది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి దేశాల సహకారంతో ఇజ్రాయిల్ ఆ ఎదురు దాడిని మరింత దృఢతతో తిప్పికొట్టింది. ఇరాన్ దాడి తర్వాత మళ్లీ ఇజ్రాయిల్ మరోసారి ఇరాన్ లోపలున్న ఆయుధ ఉత్పత్తి కేంద్రాలపై పలు బాంబుల దాడులు నిర్వహించింది. ఇప్పుడు ప్రశ్న - ఈ దాడులకు కారణాలు ఏమిటి? ఇది కేవలం ఒక దౌత్య సంస్థపై జరిపిన హత్యకు ప్రతీకారమేనా? లేక దీనికంటే లోతైన రాజకీయ, మతపరమైన అంశాలున్నాయా? ఇజ్రాయిల్-ఇరాన్ ద్వంద్వం కొత్తది కాదు. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం జరిగిన తర్వాత ఆ దేశం పూర్తి స్థాయిలో అమెరికా-ఇజ్రాయిల్ వ్యతిరేక శిబిరంలో చేరిపోయింది. షియా మతాధిపత్యాన్ని రక్షించడమే లక్ష్యంగా హిజ్బుల్లా, హమాస్ వంటి సంస్థలకు ఇరాన్ అందిస్తున్న మద్దతు ద్వారా ఈ పరిణామాలు మరింత వేగం పుంజుకున్నాయి. ఇరాన్ అణుశక్తిని అభివృద్ధి చేస్తూ, బాంబు తయారీ దశకు చేరుతున్నదన్న అనుమానాలు గత పదేళ్లుగా ప్రపంచాన్ని కలవర. పెడుతున్నాయి. ఇజ్రాయిల్‌కి ఇది గుండెల్లో రాయి. గతంలో కొన్ని సార్లు మోసాద్ గూఢచారులు ఇరాన్‌లోని అణు శాస్త్రవేత్తలను హత్య చేసిన దాఖలాలు ఉన్నాయి. ఇరాన్ తాము తక్కువ స్థాయిలో ఉన్నామని భావించడమే కాకుండా, తాము శక్తివంతంగా ఉన్నామన్న సందేశాన్ని ప్రపంచానికి ఇవ్వాలనుకుంది. అదే సమయంలో దేశంలో పెరుగుతున్న ప్రజాస్వామ్య వ్యతిరేకత, ఆర్థిక సంక్షోభం, యువతలో వ్యతిరేక భావాలను భద్రత దృష్టితో బయటకువచ్చిన ఆవేశాన్ని యుద్ధ సంచలనం ద్వారా మూలగానే పరిష్కరించాలన్న ఉద్దేశమూ ఉంది. ఇరాన్ దాడిపై అమెరికా స్పందన అనేక ఆశ్చర్యాలను కలిగించింది. అధ్యక్షుడు జో బైడెన్ స్పష్టం చేశారు - "ఇజ్రాయిల్‌పై దాడిని మేము ఖండిస్తున్నాం. కానీ ఇది యుద్ధానికి దారి తీసేలా కాకుండా నియంత్రణ అవసరం." అంటే అమెరికా తన సంప్రదాయ మిత్రుడికి మద్దతిస్తూనే, ప్రాదేశిక యుద్ధాన్ని నివారించాలన్న నిబద్ధతను ప్రదర్శించింది. అదే సమయంలో యుఎన్ భద్రతామండలి అత్యవసర సమావేశం నిర్వహించి, ఇరాన్ దాడిని ఖండిస్తూ తీర్మానం చేసింది. భారతదేశం సహా ప్రపంచ దేశాలన్నీ ఈ ఘటనపై చింతన వ్యక్తం చేశాయి. చైనా, రష్యా తదితరులు మౌనంగా స్పందించగా, అరబ్ దేశాలు - సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ - ఈ దాడులపై ఆందోళన వ్యక్తం చేసి మళ్లీ చర్చల ద్వారా పరిష్కారం కోరాయి. ఈ ఘటన ఫలితాలు కొన్ని కీలక ప్రాతినిధ్యాలు సూచిస్తున్నాయి. మొదటిగా, ఈ దాడులు మిడిల్ ఈస్ట్‌లో స్తబ్ధంగా ఉన్న శక్తుల పోరాటానికి మళ్లీ నిప్పంటించాయి. రెండవది, ఇజ్రాయిల్‌కి నేరుగా దాడికి దిగడం ద్వారా ఇరాన్ తన భయపడే మనస్తత్వాన్ని పక్కనపెట్టి కొత్త దారిలో అడుగుపెట్టింది. మూడవది, ఈ దాడుల వల్ల ఖతార్, లెబనాన్, సిరియా, ఇరాక్ వంటి దేశాల్లో సున్నీ-షియా ఘర్షణలు మళ్లీ భయంకరంగా మారే అవకాశముంది. అంతేకాదు, గాజా యుద్ధం ఇప్పటికీ కొనసాగుతుండగా, ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య నేరుగా ఘర్షణ జరగడం ఫలితంగా పశ్చిమ ఆసియా లో మానవీయ సంక్షోభం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఆయిల్ ధరలు పెరగడం, షిప్పింగ్ మార్గాల్లో అంతరాయాలు రావడం వంటి ప్రపంచ ఆర్థిక ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇది కేవలం రెండు దేశాల మధ్య మిలిటరీ కాంక్షల పోరాటం కాదు. ఇది మతం, రాజకీయ స్వాధీనం, భద్రతా ఆందోళన, ప్రపంచ శక్తుల ప్రయోజనాల మిశ్రమ సమీకరణ. ఈ మినీ యుద్ధం ఇక మౌలికంగా మార్చుకునే ప్రమాదమున్నది. చరిత్ర గమనాన్ని చూసినట్లయితే, 2006 హిజ్బుల్లా-ఇజ్రాయిల్ యుద్ధం, 2019 సౌదీ అరాంకోపై డ్రోన్ దాడి, 2021 గాజా సంక్షోభం వంటి ఉదాహరణలు మిడిల్ ఈస్ట్‌లో ఎప్పుడెప్పుడు మంటలు చెలరేగే అవకాశం ఉందని స్పష్టం చేస్తాయి. ఈ నేపథ్యంలో, శాంతి కోరిక కేవలం మాటలకే పరిమితమై పోకుండా, ప్రాతినిధ్య సమూహాల నడుమ చర్చల వేదికలు ఏర్పాటు చేయాలి. ఇజ్రాయిల్‌కు భద్రతా హామీ, ఇరాన్‌కు అణు అభివృద్ధిపై పారదర్శకత - ఈ రెండు అంశాలు ఒకే సమయంలో సాధ్యమవ్వాలి. లేకపోతే మిడిల్ ఈస్ట్‌లోని అగ్ని పర్వతం మళ్లీ బద్దలయ్యే ప్రమాదం తప్పదు.

# కులగణనతో కొత్త ప్రయాణం

మార్చి 1, 2027 నుండి జరిగే జనగణనతోపాటు కులగణన చేపట్టేందుకు కేంద్రం అంగీకరించింది. భారతదేశంలో కులగణన చేపట్టాలని చాలా కాలంనుండి, వివిధ వర్గాలనుండి బిసి సంఘాల డిమాండు వస్తున్నప్పటికీ కేంద్రం ఎస్‌సి, ఎస్‌టి వరకు మాత్రమే జనగణనలో చేర్చటం జరిగింది. ఇప్పుడు ఎత్తులు పైఎత్తులతో నిర్ణయాలు తీసుకోవటం రాజకీయాల్లో సహజం. కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఇలాగే అర్థం చేసుకోవచ్చు. ఈ నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తున్నారు. హిందూ సమాజ ఏకీకరణకు, హిందూ సంస్కృతిపై ఆధారపడే జాతీయవాదానికి కులభావాలు, మమకారాలు అడ్డంకిగా ఉన్నాయన్నది సంఘ్ పరివార్ సైద్ధాంతిక అవగాహనగా ఇప్పటివరకు చలామణి అయింది. అందుకే కాంగ్రెస్ వైపు నుండి కులగణనకు సంబంధించి ఎన్ని సవాళ్లు ఎదురైనా బిజెపి నుంచి గాని, ఆర్‌ఎస్‌ఎస్ నుంచి గాని తమ విధానం ఇది అంటూ స్పష్టమైన ప్రకటనలు రాలేదు. కులగణనకు నెహ్రూ వ్యతిరేకమంటూ బిజెపి వైపు నుంచి చాలా వ్యాఖ్యానాలు వచ్చాయి. రిజర్వేషన్లను రాజీవ్ గాంధీ లోక్‌సభలోని వ్యతిరేకించారంటూ విమర్శలు కురిపించారు. మండల్ కమిషన్ సిఫార్సులను ఇందిరా గాంధీయే తొక్కిపెట్టారని ఆరోపణలు ఎక్కుపెట్టారు. సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా సమయ, సందర్భాలను బట్టి అలాంటి ప్రకటనలు చేయలేదని చెప్పలేం. 2011లో జనగణనతోపాటు కులగణన చేస్తామని ఆనాడు కాంగ్రెస్ ప్రకటించి, ఆ తర్వాత సామాజిక, ఆర్థిక, కులగణన చేస్తామని చెప్పి, కులగణనను పక్కకు పెట్టింది. ఒకప్పటి విధానాలకు భిన్నంగా కులగణనను ప్రధాన రాజకీయ అజెండాగా మలుచుకుని నాలుగేళ్ల నుంచి కాంగ్రెసు పార్టీ కార్యాచరణ అంతా దాని చుట్టూనే తిప్పుతోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి సొంతంగా ఆధిక్యతను సాధించకుండా చేయడంలో కాంగ్రెస్ ప్రచారం బాగానే తోడ్పడింది. మోడీ కోరినట్లుగా 400 లోక్‌సభ స్థానాలను కట్టబెడితే రిజర్వేషన్లను బిజెపి రద్దు చేస్తుందని కాంగ్రెస్ ముమ్మరంగా ప్రచారం చేసింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ ప్రచారానికి ఉధృతిని ఉరవడిని తీసుకొచ్చారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా, ఎంతో పకడ్బందీగా తెలంగాణలో కులగణనను విజయవంతంగా పూర్తి చేశామని, దాన్ని మోడీ విమర్శించలేరని రేవంత్ రెడ్డి ఒకటికి పదిసార్లు చెప్పారు.ఒక రకంగా ఇప్పుడు అదే నిజమైంది. అయితే కాంగ్రెస్ ఎక్కుపెట్టిన కులగణన అస్త్రం భవిష్యత్తులో రాజకీయంగా మళ్ళీ ఇబ్బంది పెట్టకుండా దీన్ని ఒడుపుగా అందుకొని తనకు ఉపకరించే రీతిలో ప్రయోగించుకోవటానికి బిజెపి సిద్ధమైంది. దీంతో ఎంతవరకు సఫలం అవుతుందో ఇప్పుడే చెప్పలేం. కానీ కులగణనపై కాంగ్రెస్ అనుకున్నంత స్థాయిలో రాజకీయంగా మరింత విజృంభించకుండా బిజెపి పావులు కదిపిందని అర్థం. వ్యూహ ప్రతివ్యూహాలు ఎలా ఉన్నప్పటికీ కుల జనాభాను ఎలా సేకరిస్తారు అన్న దానిపైనే భవిష్యత్తు ఫలితాలు ఆధారపడి ఉంటాయి. కులంతోపాటు ఉద్యోగ, విద్య, ఆస్తుల వివరాలను పక్కగా సేకరించి వాటిని బహిరంగపరిస్తే రాజకీయ రంగమే చాలా ఒడిదుడుకులకు లోను కావాల్సి వస్తుంది. కుల జనాభాను బట్టి ఉద్యోగాలు, పదవులు ఉండాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నది. అందుకోసం రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు విధించిన 50% పరిమితిని ఎత్తివేయాలని గట్టిగా కోరుతున్నది. నిజానికి కాంగ్రెసుతోపాటు ప్రాంతీయ పార్టీలు కూడా అదే డిమాండ్‌ను ఎప్పటినుంచో వినిపిస్తున్నాయి. తెలంగాణలో చేపట్టిన కులగణనతో బిజెపి వర్గాలలో ప్రకంపనలు మొదలైనవి. 2027 మార్చి 1వ తేదీనుంచి చేపట్టే జనాభా లెక్కల సేకరణలో అంతర్భాగంగా కులాలవారీగా జనాభా గణాంకాలు కూడా సేకరించాలని నిర్ణయించడం దేశంలో ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈసారి రెండు దశల్లో జనగణన నిర్వహిస్తున్నారు. ఈ మేరకు షెడ్యూల్ విడుదల చేసింది. జూన్ 16 న గజిట్ విడుదల చేస్తున్నట్టు పేర్కొంది. భారతదేశంలో జనాభా లెక్కలను మొదటిసారిగా బ్రిటిష్ కాలంలో 1872లో చేపట్టడం జరిగింది. ఆ తర్వాత 1881 నుండి ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి దేశజనాభాను లెక్కించడం జరుగుతున్నది. మన దేశంలో జనాభా పెరుగుదల రేటు ఏకరీతిగా కనపడదు. 1901 నుండి 1921 మధ్య కాలంలో జనాభా వార్షిక పెరుగుదల రేటు కేవలం 0.2 శాతం మాత్రం ఉండగా, 1921- 51 మధ్యకాలంలో 1.2 శాతానికి పెరగడం జరిగింది. ఇక 1951- 81 కాలంలో 2.3 శాతంగా ఉన్న వార్షిక పెరుగుదల రేటు వల్ల 32 కోట్ల జనాభా అదనంగా పెరిగింది. 1951లో 36 కోట్ల ఉన్న దేశజనాభా 2001 నాటికి 102 కోట్లకు పెరగడాన్ని బట్టి మన దేశంలో 1.9 శాతం ఉన్నది. అయితే 1981 నుండి మాత్రం జనాభా పెరుగుదల రేటు తగ్గుతూ వస్తుండడం ఒక రకంగా శుభపరిణామమే. కానీ, అధిక జనాభా కలిగి ఉన్న మధ్య భారత రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల సమస్య తీవ్రతను గ్రహించాలి. 2021లో జనగణన నిర్వహించాల్సి ఉండగా, కరోనా కారణంగా వాయిదా వేశారు. ఇప్పుడు 16 ఏళ్ల తర్వాత జనగణన జరుగుతున్నది. ఈసారి జరిగే జనగణనకు విశేషమైన ప్రాధాన్యం ఉంది. కులాల జనాభా లెక్కలు కూడా సేకరించబోతున్నారు. కులగణన కోసం ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ తోపాటు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కులసంఘాలు కేంద్రంపై తీవ్ర ఒత్తిడి పెంచారు. ఇప్పటికే బీహార్, తెలంగాణలో రాష్ట్రప్రభుత్వాలు సొంతంగా కులగణన నిర్వహించాయి. దీంతో దేశమంతటా ఈ ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్లు ఊపందుకున్నాయి. కులగణన వివరాల ఆధారంగానే ప్రభుత్వ పథకాలు సంక్షేమ కార్యక్రమాలకు రూపకల్పన చేస్తే ఆ వర్గాలకు మేలు జరుగుతుందని మేధావులు, నిపుణులు సూచించారు. ఈ నేపథ్యంలో కేంద్రం కులగణనకు ఆమోదం తెలిపింది. కులగణన సేకరణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదా: తెలంగాణలో 134 కులాలు బిసి లిస్టులో ఉన్నాయి. కానీ కేంద్ర ఒబిసి లిస్టులో 86 కులాలు మాత్రమే ఉన్నాయి. సెన్సెస్ ఆఫ్ ఇండియా యాక్ట్ 1948 ద్వారా సెన్సెస్ జరుగుతున్నది. ఇప్పుడు అన్ని మతాలలోని కులాల జనగణన జరుగుతున్నది. కాబట్టి ఆ సెన్సెస్ చట్టాన్ని కూడా అవసరమైన మేరకు సవరించాలి. సమగ్రంగా పారదర్శక విధానాలతో కులగణన చేపట్టాలి. ఈ కులగణన ద్వారా సామాజిక, ఆర్థిక అవసరమైతే రాజకీయ అంశాలను లెక్కించి రాబోయే కాలంలో తగు విధాన నిర్ణయాలు, ప్రణాళికలు రచించి మానవాభివృద్ధి సూచికలలో ముఖ్యంగా విద్య, ఆరోగ్యాలలో ఘన స్థానాన్ని మెరుగుపరచుకోవచ్చు.

# వరల్డ్ కిడ్నీ క్యాన్సర్ డే అవగాహన కార్యక్రమం

**ఖమ్మంలో మొట్టమొదటి సారిగా ఫ్రీ క్యాన్సర్ సెకండ్ ఒపీనియన్ క్లినిక్ ప్రారంభం**

**ఖమ్మం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్ కుమార్**




**ఖమ్మం (సూర్య ప్రతినిధి)** ప్రపంచ కిడ్నీ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా సాయిరామ్ హాస్పిటల్స్ ప్రాంగణంలో కిడ్నీ క్యాన్సర్ అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కిడ్నీ క్యాన్సర్ గురించి ప్రజలలో అవగాహన కల్పించడం ముందస్తు గుర్తింపును ప్రోత్సహించడం రోగులు వారి కుటుంబాలకు నిపుణుల సంప్రదింపుల ద్వారా మద్దతు అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ సునీల్ కుమార్ జంగాలా ఆధ్వర్యంలో సాయిరామ్ హాస్పిటల్ వైద్య నిపుణులు కిడ్నీ క్యాన్సర్ లక్షణాలు ప్రమాద కారకాలు నివారణ చికిత్స గురించి సమాచారాన్ని అందించారు.ఖమ్మం జిజిహెచ్ ప్రభుత్వ వైద్య కళాశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్ కుమార్ మాట్లాడుతూ గత కాలంలో అంటువ్యాధులు చాలా ఎక్కువగా ఉండేవి ఇప్పుడు అవి తగ్గుముఖం పట్టి కాన్సర్ సంబంధిత వ్యాధులు ఎక్కువయ్యాయి కాన్సర్ మహమ్మారిలా మారి ప్రాణాంతకం కాకముందే గుర్తించి చికిత్స పొందడం ఉత్తమం అని అన్నారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ సునీల్ కుమార్ జంగాల ఎం.డి తో పాటు డాక్టర్ స్వాతి జంగాల చైర్మన్ శ్రీధర్ జంగాల డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్ సిఈఓ డాక్టర్ విజేష్ వర్మ నెఫ్రోలోజిస్ట్ డాక్టర్ వెంకటేష్ పున్న సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ త్రిశూల్ రెడ్డి జనరల్ ఫిజీషియన్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో భాగంగా ఖమ్మం లో మొట్టమొదటి సారిగా ఫ్రీ కాన్సర్ సెకండ్ ఒపీనియన్ క్లినిక్ ను ప్రారంభించారు.ఎవరికైతే కాన్సర్ నిర్ధారణ పై సందేహాలు ఉంటె ఫ్రీ గా సాయి రామ్ హాస్పిటల్స్ కాన్సర్ సెకండ్ ఒపీనియన్ క్లినిక్ ని సందర్శించొచ్చు . వీటితో పాటు చికిత్స ఖర్చులను సులభమైన వాయిదాలలో చెల్లించే సౌకర్యం (ఈఎంఐ) అందుబాటులోకి తీసుకొచ్చారు.ఇక రాబోయే వర్షాకాలంలో జ్వరాలు ఇన్ఫెక్షన్ల నివారణ కోసం ప్రత్యేక ఫీవర్ క్లీనిక్ కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు.

# ప్రజాస్వామ్య పాలనా గర్భంలో ఇన్ని పాపాలు

**దాగి వుంటాయని మానవుడు ఏనాడైనా ఊహించాడా...!**



**సంస్థాన్ నారాయణపూర్, ( ప్రభాత సూర్య):** ఒకనాడు రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదువలేని రాజరిక పాలన.ప్రత్యక్ష దోపిడి పన్ను వసూళ్లు కాలం పోతే ప్రజాస్వామ్యం వస్తుంది ప్రజాస్వామ్యంలో ప్రజలు పాలకుల దోపిడీకి గురికాకుండా జీవించొచ్చని ప్రజాస్వామ పాలన కొరకు ఎన్నో త్యాగాలు మరెన్నో బలి దానాలు జరిగి చివరికి ప్రజాస్వామ్య పాలన వచ్చింది.ప్రజాస్వామ పాలన వచ్చింది గానీ ప్రజల పాలన కాదని ఆచరణలో తేలిపోయింది. గత పది సంవత్సరాల భారతీయ జనతా పార్టీ పాలనా కాలంలో దేశ పాలనా వ్యవస్థ రాజరిక వ్యవస్థను తలపిస్తుంది.రాజరిక వ్యవస్థలో రాజు ఎలాంటి విచారణ లేకుండానే ప్రజలను బంధించినట్లు నరేంద్ర మోడీ పరిపాలనా కాలంలో దేశంలోని ప్రజాస్వామ్యిక వాదుల ప్రతిపక్ష నాయకులను,ఎలాంటి విచారణ లేకుండానే సంవత్సరాల తరబడి జైలులో బంధించడం అవసరమనుకుంటే రాజద్రోహం నేరాలు మోపటం జరుగుతుంది.

**పది సంవత్సరాల భారతీయ జనతా పార్టీ పాపల చిట్ట అతి కొద్దిగా చూద్దాం..!**

గత పది సంవత్సరాల భారతీయ జనతా పార్టీ పాపల చిట్ట చూసినట్లయితే ? దేశంలో ఉన్న యే రాష్ట్రాన్ని వదలకుండా అన్ని రాష్ట్రాలలో ఒక అప్రజాస్వామ్యిక సంఘటనలు చోటుచేసుకున్నాయి.

**ఆర్టికల్ 370 రద్దు**

ఆర్టికల్ 370 రద్దు చేసి జమ్మూ కాశ్మీర్ ప్రజలను భారతీయ కార్పోరేట్ల కాళ్ళకిందికి గుంజుకొచ్చారు.తరతరాలుగా జమ్మూ కాశ్మీర్ ప్రజలు కాపాడుకుంటున్న ప్రజల సంస్కృతిలోకి ఇతర రాష్ట్రాల సంస్కృతి ప్రవేశించే విధంగా మార్చివేశారు.శతాబ్దాలుగా జమ్మూ కాశ్మీర్ ప్రజల చెమట చుక్కలతో తడిసిన నేల నేడు భారతీయ కార్పోరేట్ల వశం కాబోతుంది.రాష్ట్రంగా వున్న జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని నిట్ట నిలువున చీల్చి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు చేశారు.కొన్ని దశాబ్దలుగా ఈ దేశంలోని ప్రజాస్వామ్యిక వాదులు,మేధావీ వర్గం జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీలో ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని డిమాండ్ చేశారు కానీ భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏనాడు ఈ దేశంలోని ప్రజాస్వామిక వాదుల,మేధావి వర్గం వాదనలు లెక్క చేయలేదు.మొత్తంగా భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం జమ్మూ కాశ్మీర్ ప్రజలను కాశ్మీర్ మంచుకొండల్లో ముంచి వేసింది.

**మణిపూర్ మరణహోమం.**

గత రెండు సంవత్సరాలుగా మణిపూర్ రాష్ట్రంలో మారణహోమం జరుగుతోంది. రాష్ట్రంలో మెతేయిలకు కూకీలకు మధ్య జరుగుతున్న ఘర్షణ నేటికీ శాంతి నెలకొల్ప లేదు.రాష్ట్రంలో ఎటుచూసినా కర్ఫ్యూ వాతావరణం, ఇంటర్నెట్ సేవల నిలిపివేత,భద్రతా బలగాల మోహరింపు, టియర్ గ్యాసులు, లాఠీ చార్జీలు.ఇలాంటి పరిపాలనను ఎవరైనా ప్రజాస్వామ్య పాలన అనగలమా.ప్రజలచేత ఎన్నుకోబడి ప్రజలపై ఉక్కుపాదం మోపడం కూడా ఒక ప్రజాస్వామ్య పాలనేనా.

**ఆపరేషన్ ఖరార్..!**

ఆపరేషన్ ఖరార్ పేరుతో నేడు మావోయిస్టులను అంతం చేస్తామని స్థానికంగా నివసిస్తున్న ఆదివాసులను పసిపిల్లల నుండి వృద్ధుల వరకు తుపాకి తూటాలకు బలి చేస్తున్నారు.ఆరు ఏడు రాష్ట్రాల విస్తీర్ణంలో ఉన్నటువంటి దండకారణ్యం అడవిలోని ఖనిజ సంపదను నరేంద్ర మోడీ తన దోస్తులకు అప్పజెప్పడానికి ఎన్ని దుర్మార్గాలకు పాలుపడాలో అన్ని దుర్మార్గాలకు పాలుపడుతునారు. అభివృద్ధి పేరిట అడవిలోకి ప్రవేశించే పెట్టుబడికి ఆత్మ గౌరవం వుంటుందంటే ఎవరమైనా నమ్మగలమా.పెట్టుబడి లాభాన్ని ఆశిస్తుంది కానీ మానవ సంబంధాల వైపు చూడదని పాలకులకు అర్థమయ్యే రోజులొచ్చేనా భారతీయ జనతా పార్టీ పాలనా కాలంలో.

**ఈడబ్ల్యూయస్ రిజర్వేషన్లు**

దేశంలో రిజర్వేషన్ల పుట్టుకకు వ్యతిరేకంగా అగ్ర కులాల వారికి రిజర్వేషన్లు కల్పించిన చరిత్ర భారతీయ జనతా పార్టీ ప్రభుత్వానిది.ఒకనాడు దేశంలో ఉన్న సామాజిక వివక్షతతోపాటుగా ఆర్థిక వెనుకబాటుతనం ఉన్న ప్రజలకు రిజర్వేషన్లను కేటాయించారు కానీ నేడు కేవలం ఆర్థిక వెనకబాటుతనం పేరిట అగ్ర కులాల వారికి పదిశాతం రిజర్వేషన్లు కేటాయించారు. దేశంలో అగ్ర కులాల జనాభా కేవలం పదిశాతం మాతమే వున్నది అందులో పేదలు కేవలం మూడు శాతం మంది మాత్రమే కానీ వారికి పదిశాతం రిజర్వేషన్లు కేటాయించారు.రిజర్వేషన్ల పరిధి యాభై శాతానికి మించొద్దని ఇందిరా సహాని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నప్పటికీ.నరేంద్ర మోడీ పాలనలో న్యాయస్థానాల జోక్యం ఎక్కడుంది.కోర్టులను లెక్క చేయకూండా చేసే పాలనా కూడా ఒక ప్రజా పాలనేనా. దేశంలోని ప్రజాస్వామిక వాదులపై దేశంలోని మేధావి వర్గంపై నేడు సిబిఐ కేసులు, ఎన్ ఫోర్స్ మెంట్ కేసులు,ఇన్ కమ్ టాక్స్ కేసులు, రాజద్రోహం కేసులు, అర్బన్ నక్సలైట్ కేసులు వందలలో పేరుకుపోతున్న నియంత పాలనా కాలం ఇది.దేశంలో వివిధ రాష్ట్రాలలో తనకు అనుకూలంగా లేని ప్రభుత్వాలను కూల్చటం,తనకు అనుకులమైన పార్టీలను గద్దె ఎక్కించటం జరుగుతుంది.గత పది సంవత్సరాలుగా భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ పాలనా కాలంలో చెప్పుకుంటుపోతే వందల దుర్మార్గాలు.లౌకిక దేశాన్ని మతపరమైన దేశంగా మార్చివేయాలనే కుట్ర జరుగుతున్న పాలన ఇది. రాజరిక వ్యవస్థను తలపిస్తున్న పాలనను కూడా ప్రజా పాలన అనవచ్చునా. ప్రజాస్వామ్య పాలనా గర్భంలో ఇన్ని పాపాలు దాగి వుంటాయని మానవుడు ఏనాడైన ఊహించాడా..?

# స్వచ్ఛ తుర్కయంజల్ కోసం కృషి







**చేస్తున్న సిబ్బందికి వైద్య పరీక్షలు**

**పారిశుద్ధ్య సిబ్బంది ఆరోగ్యం సైతం ప్రాధాన్యం**

**తుర్కయంజాల్ మున్సిపల్ కాంగ్రెస్ నేతల సందేశం**




**తుర్కయంజల్, జూన్ 20 ( ప్రభాత సూర్య ) :** తుర్కయంజల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడ గ్రామంలో పారిశుద్ధ్య సిబ్బంది, మహిళా సంఘ సభ్యుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్య శిబిరం నిర్వహించారు. ప్రతి రోజూ ఒక చర్య ఒక మార్పు అనే 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాగన్నగూడకు చెందిన చలసాని కల్యాణ మండపంలో ఈ హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సిబ్బందికి బీపీ, ఇతర సాధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు సామ భీంరెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం సేవ చేస్తున్న శానిటేషన్ సిబ్బందికి ఆరోగ్య పరిరక్షణ అవసరం అని అన్నారు. మాస్కులు, గ్లౌజులు వాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో శ్రీనివాస్, వార్డు ఆఫీసర్ బాలరాజు, బిల్ కలెక్టర్లు, కాంగ్రెస్ నేతలు రేవల్లె యాదగిరి, గోదాసు భద్రయ్య, డాక్టర్లు శృతి, శిరీష, అజిత్ మరియు ఆరోగ్య సిబ్బంది డి. లక్ష్మి నారాయణ, డి. నర్సింహ, జె. పద్మ, వజ్రమ్మ, స్వప్న, సాగర్, రఘుపతి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## చొప్పదండి ఎమ్మెల్యే సతీమణి ప్రథమ వర్ధంతి

**యువసేన స్వచ్ఛంద సేవ సంస్థ ని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం**




**రామడుగు, ( ప్రభాత సూర్య ):** చొప్పదండి నియోజకవర్గ శాసన సభ్యులు డా" మేడిపల్లి సత్యం సతీమణి మేడిపల్లి రూపాదేవి ప్రథమ వర్ధంతి సందర్భంగా రామడుగు మండలం దేశరాజుపల్లి గ్రామంలోని స్పందన యువసేన స్వచ్ఛంద సేవ సంస్థ లోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చెర్మన్ బొమ్మరవేణి తిరుమల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాజీ ఎంపిపి జవ్వాజి హరిష్, దేశరాజుపల్లి గ్రామ సర్పంచ్ కోల రమేష్ , మాజీ ఎంపిపి వీర్ల నర్సింగరావు, జిల్లా ప్రదాన కార్యదర్శి పంజాల శ్రీను, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ పిండి సత్యం రెడ్డి, శుక్రోద్దిన్, ఎల్లమల క్రిష్ణ, శంకరయ్య, భువన్ కూమర్, అమిరిశెట్టి సుదాకార్, ఎల్కపెల్లి లచ్చయ్య, భరత్, కటుకం మనీష్, వర్దన్ తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ లో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలి

**ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి**

**బోయ లింగస్వామి మాదిగ**



**చౌటుప్పల్,( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల ప్రాంత పరిధిలో గత 30 సంవత్సరాలుగా డిగ్రీ కాలేజీ లేక ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల ప్రజలు విద్యకు దూరమవుతూ ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఈ రాష్ట్రాన్ని పాలించిన పాలకులు ఈ ప్రాంత అభివృద్ధి గురించి పట్టించుకోలేదు హైదరాబాదుకు కూతవేటు దూరంలో ఉన్న ఈ ప్రాంతంలో డిగ్రీ కాలేజీ కట్టించలేదు మరి ఇప్పటికైనా మునుగోడు నియోజకవర్గానికి అభివృద్ధి పదంలో నడిపిస్తున్నామని ప్రగల్భాలు పలికే ప్రభుత్వ పెద్దలు అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలుగా కావస్తున్న ఇప్పటివరకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గురించి పట్టించుకోకపోవడం బాధాకరం ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు ఈ ప్రాంతంలో ఉన్నటువంటి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అగ్రవర్ణ పేదల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాం లేనియెడల భవిష్యత్తులో ఈ ప్రాంతంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం.

## కలెక్టర్ దత్తత తీసుకున్న విద్యార్థి కళాశాలలో ప్రవేశం

**హర్షం వ్యక్తం చేసిన కళాశాల ప్రిన్సిపాల్ మాతేశ్వరి**



**సంస్థాన్ నారాయణపురం, ( ప్రభాత సూర్య ప్రతినిధి ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని కంకణాల గూడెం గ్రామపంచాయతీ శేరిగూడెం గ్రామానికి చెందిన దేవరకొండ భరత్ చంద్ర విద్యార్థి గత సంవత్సరం పదవ తరగతిలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు దత్తత తీసుకోవడంతో విద్యార్థి ఉత్తీర్ణత పొంది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ తీసుకోవడంతో కళాశాల ప్రిన్సిపాల్ మాతేశ్వరి విద్యార్థిని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ దత్తత తీసుకున్న విద్యార్థి మా కళాశాలలో ప్రవేశం చేసుకోవడంతో ఇంటర్మీడియట్ విద్యను రెండు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకోవాలని విద్యార్థికి సూచించారు.ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ మంగ్యా నాయక్, అధ్యాపక బృందం, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## బాలిక సాధికారత శిక్షణ కార్యక్రమం




**ప్రభాత సూర్య మర్రిగూడ** మర్రిగూడెంలోని కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాలలో ఐసిడిఎస్, హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలిక సాధికారతపై శిక్షణ నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పోషణ విద్య, కిశోర ప్రాయంలో జరిగే మార్పులు, పోస్కో చట్టం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మున్నయ్య ఎంఈఓ శ్రీనివాస్, యశోద, శ్రీలత, సబిత, అరుణ పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇల్లు శంకుస్థాపన చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**సంస్థాన్ నారాయణపూర్, ( ప్రభాత సూర్య )** యాదాద్రి భువనగిరి సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు పులమోని గోపాల్ ఇందిరమ్మ ఇల్లు శంకుస్థాపన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు జక్కిడి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి, మందు గుల బాలకృష్ణ,మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ హాజరై శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అందే యాదయ్య, ఉప్పల రాజయ్య, పిఎసిఎస్ డైరెక్టర్ ఉప్పల కృష్ణ, గునిగంటి రాజు, బద్ధం గిరి భూపని బలరాం, గొల్లూరు బిక్షం, పులగోని నరసింహ, దుర్గం లాలయ్య, నీళ్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

## సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు

**జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్**

**జగిత్యాల :** సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లాలోని లింగంపేట్ గ్రామంలో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పర్యటించారు.ఈ సంధర్భంగా సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నిరోధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

రాబోయే 3 నెలల పాటు పారిశుధ్య నిర్వహణను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ పారిశుద్ధ్య కమిటీలలో వైద్య శాఖ సిబ్బంది భాగస్వామ్యం చేయాలని అన్నారు. ఆశా కార్యకర్తల దగ్గర అన్ని విధాల మందులు జ్వరం, దగ్గు ,సీజనల్ వ్యాధులు సంబంధించి ప్రజలకు అవసరమైన మేరకు అందించాలని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం గ్రామాలలో ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని,డ్రైనేజీలలో ఆయిల్ బాల్స్ వేయాలని అన్నారు.

## థాయ్‌లాండ్‌లో కొడుకు పెళ్లి.. ఏసీబీ కస్టడీకి నూనె శ్రీధర్..

**హైదరాబాద్ :** కాళేశ్వరం ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ను కస్టడీకి తీసుకొని విచారించనున్నారు ఏసీబీ అధికారులు. కరీంనగర్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్గా పనిచేస్తున్నటువంటి శ్రీధర్ నివాసం కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు పది రోజుల క్రితం సోదాలు నిర్వహించి రూ.200 కోట్లకు పైగా ఆస్తులను గుర్తించారు. అంతేకాకుండా కుమారుడి వివాహం థాయిలాండ్‌లో చేయగా రిసెప్షన్ హల్దీ ఫంక్షన్స్ రిసార్ట్లల్లో పలు హోటల్స్ లలో నిర్వహించారు.అధికారులు గుర్తించినటువంటి ఆస్తుల్లో తెల్లాపూర్ లోని విల్లా షేక్పేట్ లో గేటెడ్ కమ్యూనిటీ హాల్లో ప్లాట్, అమీర్‌పేట్‌లో కమర్షియల్, కాంప్లెక్స్ కరీంనగర్‌లో మూడు ప్లాట్లు, హైదరాబాద్ వరంగల్ కరీంనగర్లలో మూడు భవనాలు, 16 ఎకరాల భూమి, 19 ఇళ్ల స్థలాలు, రెండు కార్లు, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లను గుర్తించారు. ఈ విధంగా పెద్ద మొత్తంలో ఆస్తులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శ్రీధర్‌ను కస్టడీకి తీసుకొని విచారిస్తే చాలా అంశాలు బయటపడే అవకాశం ఉంటుందని భావించిన అధికారులు ఏసీబీ కోర్టులో ఐదు రోజులపాటు కస్టడీ పిటీషన్ను దాఖలు చేశారు. ఏసీబీ కోర్టు అందుకుగాను ఐదు రోజుల పాటు కస్టడీని అధికారులకు ఇచ్చింది. ఈ రోజు ఉదయం శ్రీధర్ను కస్టడీకి తీసుకొని ఐదు రోజులు పాటు విచారించరున్నారు ఏసీబీ అధికారులు. కాలేశ్వరంలో కీలక బాధ్యతలు చూసినటువంటి నూనె శ్రీధర్ సంవత్సరం పాటు ప్రిన్సిపల్ సెక్రటరీ ట్రాన్స్ఫర్ చేసిన అక్కడే ఉండి పనిచేయడం, అందుకుగాను కాలేశ్వరంలో పనిచేస్తున్న ఈఎంసి అనిల్ ఆదేశాల మేరకే అక్కడ ఉండి పనిచేసినట్లు అధికారులు భావిస్తున్నారు. అయితే అనిల్‌కు ఎవరు ఆదేశాలు జారీ చేశారు? ప్రిన్సిపల్ సెక్రటరీ ట్రాన్స్ఫర్ చేసినా ఎందుకు అక్కడే పని చేశారు? ఎవరి ఆదేశాల మేరకు ఇదంతా జరిగిందని కోణంలో ఏసీబీ అధికారులు విచారించబోతున్నారు. మరోవైపు బ్యాంకు లాకర్ సైతం కూడా తెరిచి శ్రీధర్ ఆస్తుల చిట్టాను బయటపెట్టే అవకాశం కనిపిస్తోంది.

## ఆడపులిపేరు క్లీంకారా...

**హైదరాబాద్ :** గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సతీమణి ఉపాసన మరోసారి తన గొప్ప మనసు చాటుకున్నారు. మెగా గారాల పట్టి 'క్లీంకార' బర్త్ డే సందర్భంగా హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్కులోని పులి పిల్లలను దత్తత తీసుకున్నారు. వాటిలో ఓ ఆడపులికి 'క్లీంకార' పేరు పెట్టారు.ఈ సందర్భంగా టైగర్ ఎన్‌క్లోజర్ వద్ద కూతురు క్లీంకారతో కలిసి దిగిన ఫోటోను ఉపాసన తాజాగా.. తన ఇన్ స్టాలో షేర్ చేశారు. ప్రస్తుతం ఇది వైరల్ అవుతోంది. ఈ సందర్భంగా జూ పార్కు సిబ్బందికి థాంక్స్ చెప్పారు ఉపాసన. జూలోని ఓ ఆడపులికి తన కూతురి పేరు పెట్టినట్లు చెప్పారు. 'ఏడాది క్రితం ఇది కేవలం ఓ చిన్న పులి పిల్ల. కానీ ఈ రోజు ఇది ఒక ఉల్లాసభరితమైన ఆడపులి. దానికి మా కుమార్తె క్లీంకార పేరు పెట్టడం చాలా ఆనందంగా ఉంది. ఇంతటి ప్రేమాభిమానాలు చూపించిన హైదరాబాద్ జూ సిబ్బందికి థాంక్స్. వన్యప్రాణులు అడవికే సొంతం. అయినా వాటిని సంరక్షించేందుకు మేము సపోర్ట్ చేస్తాం. దయ, ధైర్యం, కరుణతో పెరగడం ఇక్కడ ఉంది.' అంటూ రాసుకొచ్చారు.

**క్లీంకార' బర్త్ డే స్పెషల్**

తన కుమార్తె 'క్లీంకార' రెండో బర్త్ డే సందర్భంగా పాపతో కలిసి జూపార్కుకు వెళ్లిన ఉపాసన.. జూలోని వివిధ జంతువుల ఎన్‌క్లోజర్స్ వీక్షించారు. ఆ తర్వాత జూపార్కులోని పులి పిల్లలను దత్తత తీసుకున్నారు. వాటి పోషణకు అవసరమైన డబ్బులను చెక్కు రూపంలో జూ పార్క్ డైరెక్టర్ డా.సునీల్ హిరేమత్‌ను సంప్రదించి అందజేశారు. శుక్రవారం తమ గారాల పట్టి క్లీంకార బర్త్ డే సందర్భంగా.. జూలోని ఓ ఆడపులికి ఆమె పేరు పెట్టారు. దీంతో వారికి కృతజ్ఞతలు తెలిపారు ఉపాసన. 2012లో రామ్ చరణ్, ఉపాసన వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. దాదాపు 11 ఏళ్ల తర్వాత వారికి కుమార్తె 'క్లీంకార' పుట్టింది. ఇప్పటివరకూ చిన్నారి ఫేస్ రివీల్ కాకుండా జాగ్రత్త పడ్డారు. అప్పుడప్పుడూ చరణ్ చిన్నారిని ఎత్తుకున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కాగా.. 'క్లీంకార' పూర్తి ఫేస్ మాత్రం రివీల్ కాలేదు. ఇప్పుడు కూడా ఉపాసనతో 'క్లీంకార' ఉండగా.. పాప్ ఫేస్ పూర్తిగా కనపడకుండా ఫోటోలు పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఇవి వైరల్ అవుతున్నాయి.ఇక సినిమాల విషయానికొస్తే.. రామ్ చరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు డైరెక్షన్‌లో 'పెద్ది' మూవీ చేస్తున్నారు.

## విశాఖలో రికార్డుల యోగ

**విశాఖపట్టణం :** చరిత్రలో నిలిచిపోయేలా యోగాంధ్ర-2025కు ఏపీ సర్కార్ శ్రీకారం చుట్టింది. ప్రపంచ రికార్డు సృష్టించేలా సాగరతీరంలో లక్షల మందితో యోగాసనాలు వేయించేందుకు రంగం సిద్ధమవుతోంది. 'యోగా ఫర్ వన్ ఎర్త్-వన్ హెల్త్' నినాదంతో నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు చంద్రబాబు. యోగాంధ్రతో రెండు గిన్నిస్ రికార్డుల కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

# రాజకీయాల్లో యువత పాత్ర ఎంతో కీలకం

**-రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి**





**ఖమ్మం( సూర్య ప్రతినిధి)** రాజకీయాల్లో యువత పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జెక్కిడి శివచరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్ అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నుండి మయూరి సెంటర్ లోని రాజీవ్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి స్వర్గీయ రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం జిల్లా ఎక్స్టెండెడ్ ఎక్స్ క్యూటివ్ సమావేశం సుమారు 300 మంది జిల్లా అసెంబ్లీ మండల కార్యకర్తలతో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. మన పని మనం చేసుకు పోవాలని పార్టీ తన పని తాను చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిపోతే అయినా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమంలో ఏ మాత్రం రాజీ పడకుండా అనుకున్న విధముగా అన్ని వాగ్దానాలు అమలు చేసుకుంటూ పోతుందని అన్నారు.ప్రతిపక్ష పార్టీ అదే పనిగా కాంగ్రెస్ పై బురద జల్లే ప్రయత్నం చేస్తుందని దాన్ని మనం గ్రామ స్థాయిలో తిప్పి కొట్టాలని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్ మాట్లాడుతూ రాబోవు లోకల్ బాడీ ఎన్నికల్లో క్రియాశీలక పాత్ర పోషించి ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు అత్యధిక మెజారిటీ తో గెలుపొందేలా కృషి చేయాలని అన్నారు. సీనియర్ల సలహాలు సూచనలతో నూతన కార్యవర్గం ముందుకు పోతున్నదని ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మారుమూల ప్రాంతాల్లో కి తీసుకెళ్లి పూర్తి స్థాయిలో గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.రాబోవు ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ పటిష్ఠంగా ఉన్న దగ్గర యువజన కాంగ్రెస్ కే అత్యధిక సీట్లు వచ్చే విధాంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంతో కోట్లాడదామని అన్నారు. జిల్లా ఇంచార్జి దీపక్ ప్రజ్ఞ మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావడానికి యువజన కాంగ్రెస్ ఒక ఫ్లాట్ ఫామ్ వంటిదని అన్నారు. కష్టపడి పని చేసే వారికి పదవులు వాటంతట అవే వస్తాయని అన్నారు. యువజన కాంగ్రెస్ లో కొత్త పాత ఏమీ లేదని ఎవరికీ ఏ సాయం కావాలి అన్నా జిల్లా ఇంచార్జీ గా ఎప్పుడు అందుబాటులో ఉంటానని అన్నారు.ప్రతి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పని చేసి మీరు చేసిన పని గుర్తు పెట్టుకునేలా చేసుకోవాలని అన్నారు. సోషల్ మీడియా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా చేసిన ప్రతి పని దాని ద్వారా రాష్ట్ర నాయకులు తెలిసే విధముగా సర్క్యులేట్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ కుమార్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడ్లపల్లి సంతోష్ ఖలీల్ పాషా బెజ్జం గంగాధర్ భానోత్ కొటేష్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల మహేష్ క్రాంతి బెల్లంకొండ శరత్ రాధాకృష్ణ ఉత్తేజ్ భూక్యా భద్రం కార్తీక్ అన్ని అసెంబ్లీ నియోజక వర్గ అద్యక్షులు మండల అద్యక్షులు యువజన కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# ఒక్కడే చాలు... అన్నట్టుగా ట్రాఫిక్ క్లియర్ చేసిన సీఐ ఆదిరెడ్డి

**చండూర్‌లో రద్దీను అదుపు చేసిన అదరగొట్టే పోలీసింగ్**

**ప్రజల ప్రశంసలతో సోషల్ మీడియాలో వైరల్**





**నల్లగొండ బ్యూరో, ప్రభాత సూర్య :** చండూర్ మండల కేంద్రంలో శుక్రవారం అంగడి నేపథ్యంలో రోడ్లపై భారీగా వాహనాలు నిలిచిపోవడం, ట్రాఫిక్ అంతరాయం కలగడం చూశారు స్థానికులు. ఒకవైపు ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులందరూ తీవ్ర అసహనానికి లోనవుతుండగా, మరోవైపు రద్దీ వల్ల చిన్నచిన్న వాగ్వాదాలు చోటుచేసుకుంటున్న వేళ... చండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి వెంటనే రంగంలోకి దిగారు. ఆసమయంలో ఆయనకు తోడుగా ఎలాంటి ట్రాఫిక్ సిబ్బంది, కానిస్టేబుళ్లు లేకపోయినా, అదృశ్యంగా మారిన శాంతిభద్రతల చట్టాన్ని తన ఒంటరిగా ప్రజలకు మద్దతుగా నిలిచాడు. ఎంతో సమర్థవంతంగా కొద్ది సమయంలోనే రద్దీని నివారిస్తూ ట్రాఫిక్‌ను పూర్తిగా క్లియర్ చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి స్వయంగా రోడ్డుపైకి వచ్చి, వాహనదారులకు నిశ్చితమైన మార్గదర్శకాలు ఇస్తూ, క్రమపద్ధతిలో వాహనాలను తరలించారు. రద్దీ కారణంగా ఉద్రిక్తతలే తలెత్తనున్న దశలో ఇన్‌స్పెక్టర్ చొరవతో పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చింది. ఈ దృశ్యాలను పలువురు వాహనదారులు తమ మొబైల్ కెమెరాల్లో బంధించారు. ఆయన చేసిన సేవను ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. "శభాష్ చండూర్ పోలీస్" ఇతనిలాంటి వారే నిజమైన సర్వీస్ మైండ్ ఉన్న అధికారి, విధిని పూజగా భావించేవాడు వంటి వ్యాఖ్యలు ప్రజల నోట వినిపిస్తున్నాయి.

**పరిధిలో కానప్పటికీ కర్తవ్యపరంగా స్పందన**

ఆదిరెడ్డి వాహనాల రద్దీ చోటుచేసుకున్న ప్రాంతం సాంకేతికంగా తన సర్కిల్ పరిధిలోకి రానప్పటికీ, చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్న దృక్పథంతో స్పందించడం ప్రజల్లో మక్కువ కలిగించింది. ఇలా పరిధి అనేది విధి ముందు అడ్డంకిగా కాకూడదన్న సందేశాన్ని ఆదిరెడ్డి తన చర్యల ద్వారా రుజువు చేశారు.

**పోలీసింగ్‌కు బ్రాండ్ గౌరవం**

ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డికి ఇప్పటికే ప్రజల్లో మంచి పేరు ఉంది. శాంతిభద్రతలపై నిబద్ధత, ప్రజలతో మమేకత, సమస్యలపై చొరవ చూపే తత్వం వల్ల ఆయన్ను ప్రజలు ఒక బ్రాండ్ ఆఫీసర్ గా పరిగణిస్తున్నారు. ఏ పోస్టింగులో అయినా, బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించడంలో ఆయన్ని తలపోలేరు అని పలువురు స్థానికులు ప్రశంసిస్తున్నారు. వీళ్ల లాంటి పోలీసులుండడం గర్వకారణం. వీళ్ల డ్యూటీ చూసి మేము కూడా స్ఫూర్తి పొందుతున్నాం అని అంటున్నారు. స్థానికులు విధులు అంటే ఏమిటో చూపించిన అధికారిగా ఆదిరెడ్డి ని మేము నిలువెత్తు అభినందిస్తున్నాం. ఆయన చేసిన పని చిన్నదే గా అనిపించొచ్చు కానీ, ప్రజల పట్ల ఓ పోలీస్ అధికారికి ఉండాల్సిన ధర్మాన్ని ప్రతిబింబించింది.

# సాక్ష్యం చెప్పడానికి రండి

**హైదరాబాద్ :** తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరింత విస్తరిస్తోంది. ఇది ఒకరిద్దరికే పరిమితం కాకుండా తెలుగు రాష్ట్రాల్లో కీలక నేతలంతా ఈ సర్వైలెన్స్‌లోకి వచ్చేశారా అనే అనుమానం కలుగుతోంది. కేంద్రమంత్రి బండి సంజయ్ సన్నిహితులు, సిబ్బంది ఫోన్లు ట్యాప్ అయినట్టు అధికారులు గుర్తించారట. ఇప్పుడు ఆ దిశగా దర్యాప్తు టర్న్ అవుతున్నట్టు తెలుస్తోంది. కేంద్రమంత్రి బండి సంజయ్‌కు సంబంధించిన వారి ఫోన్లు ట్యాప్ అయ్యాయాలేదా అనే విషయాన్ని గుర్తించేందుకు కరీంనగర్ బీజేపీ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావును సిట్ అధికారులు పిలిచారు. గతంలో జరిగిన ఘటనలు వివరించాలని ఆదేశించారు. ఇప్పుడు ఆయన చెప్పే సాక్ష్యం ఆధారంగా దర్యాప్తును ముందుకు తీసుకెళ్లనున్నారు. బండి సంజయ్‌కు ప్రవీణ్‌రావు చాలా సన్నిహితుడు. టెన్త్‌పేపర్ లీక్, బైంసా అల్లర్లు, ఇతర కార్యక్రమాల్లో బండి సంజయ్‌తోపాటు ప్రవీణ్‌రావు పాల్గొన్నారు. ఎప్పుడూ వెన్నంటి ఉండే ప్రవీణ్‌రావు ఫోన్‌ను అప్పట్లో ట్యాప్ చేసినట్టు అధికారులు తేల్చారు. ఇప్పుడు వాటిపై నిగ్గు తేల్చే పనిలో ఉన్నారు. అందుకే ఆయనకు నోటీసులు పంపించి విచారణకు పిలుస్తున్నారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కొందరు కాంగ్రెస్ నాయకులు సిట్ ముందు హాజరై తమ ఫోన్‌లు ట్యాప్ అయినట్టు వాంగ్మూలం ఇస్తున్నారు. అందుకు సాక్ష్యాలను కూడా సిట్ అధికారులు అందజేస్తున్నారు. ఇప్పటికే పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ హాజరై సిట్‌కు స్టేట్మెంట్ ఇచ్చారు. ఇప్పుడు చెన్నూరు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ లీడర్లు సిట్ విచారణకు హాజరయ్యారు.

**సాక్షులుగా స్టేట్మెంట్‌లు ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు**

హైదరాబాద్‌లో ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు రామకృష్ణాపూర్ కాంగ్రెస్ నాయకుడు, తవక్కల్ విద్య సంస్థల అధినేత అబ్దుల్ అజీజ్, మందమర్రి కాంగ్రెస్ నాయకుడు ఎండీ ముజాహిద్ హాజరయ్యారు. గత ప్రభుత్వం హయాంలో చాలా ఇబ్బంది పడ్డట్టు చెప్పారు. బాల్క సుమన్ లాంటి వారు హింసించారని ఆరోపించారు. వివేక్‌కు మద్దతుగా ఉన్నందుకు ఫోన్‌లు ట్యాప్ చేసి బెదిరింపులకు పాల్పడినట్టు వివరించారు. పోలీసులు, కీలక నేతలు భయపెట్టారని అన్నారు. తమ ఫోన్ ట్యాప్ అయిన సంగతి సిట్ అధికారులు చెప్పే వరకు తెలియదని తర్వాత నాటి సంగతులు గుర్తుకు వచ్చాయని అన్నారు. దాదాపు ఆరు నెలల పాటు తమను వెంటాడినట్టు చెప్పుకొచ్చారు. మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్ రావును కూడా సిట్ అధికారులు పిలిచి విచారించారు. సాక్షిగా వాంగ్మూలం తీసుకున్నారు. ఈ ఉదయం 10.30కి ఆయన తన స్టేట్మెంట్ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలోనే ఫోన్ ట్యాపింగ్ కుట్ర జరిగిందని ఆరోపించారు. అధికారులు కీలకమైన వ్యక్తుల ఫోన్‌లు ట్యాప్ చేసి సమాచారాన్ని కేసీఆర్, సంతోష్‌కు చేర్చేవారని అన్నారు. ఇలా చేయడం వల్లే ఓటుకు నోటుఅంశం వెలుగు చూసిందని తెలిపారు. కవిత, పైలెట్ రోహిత్ రెడ్డి, రేగా కాంతారావు లాంటి వాళ్ల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని విమర్శించారు. రాజకీయ నాయకులతోపాటు సినిమా, బిజినెస్ వాళ్ల ఫోన్‌లు కూడా ట్యాపప్ చేశారని ఆరోపించారు.



**సుప్రీం కోర్టుకు సిట్**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో తవ్వే కొద్దీ కొత్తకొత్త విషయాలు? విచారణ లోతుకు వెళ్లే కొద్దీ సరికొత్త అంశాలు వెలుగులోకొస్తున్నాయి. ఈ కేసులో ఏ1గా ఉన్న ప్రభాకర్‌రావును ఇప్పటికే మూడుసార్లు ప్రశ్నించిన అధికారులు?ఆయన నుంచి సరైన సమాధానం లేకపోవడంతో ఇవాళ నాలుగోసారి కూడా విచారించారు. పదుల సంఖ్యలో ప్రశ్నలు సంధించారు. అయితే ప్రభాకర్ రావు వ్యవహారంలో సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సిట్ సిద్ధమవుతోంది. ప్రభాకర్‌రావుకు రిలీఫ్ రద్దు చేయాలని న్యాయస్థానాన్ని కోరనుంది. మరోవైపు కస్టోడియల్ విచారణ కోసం నాంపల్లి కోర్టులోనూ పిటిషన్ వేసే అవకాశం కనిపిస్తోంది.ట్యాపింగ్ కేసులో నిన్నటికి నిన్న సస్పెండెడ్ డీఎస్పీ ప్రణీత్‌రావునూ విచారించారు అధికారులు. ఎన్నికల ముందు ఎస్ఐబీలో స్పెషల్ ఆపరేషన్ టార్గెట్‌ను ప్రణీత్ రావు లీడ్ చేయడంతో పాటు రాజకీయ నేతలు, ప్రముఖుల ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లు గుర్తించిన అధికారులు? పలు ఆధారాలను ఆయన ముందుంచి ప్రశ్నించారు. అయితే ప్రణీత్‌రావు పలు కీలక డాక్యుమెంట్లు అధికారులకు సమర్పించినట్లు తెలుస్తోంది. మరోవైపు బాధితుల వాగ్మూలాలను రికార్డ్ చేస్తున్నారు అధికారులు. ఇప్పటికే పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తో పాటు మరో 20మంది వరకు సాక్షులు తమ వాంగ్మూలాలను ఇచ్చారు. మొత్తంగా? అమెరికా నుంచి ప్రభాకర్‌రావు వచ్చాక స్పీడ్ పెంచిన సిట్ అధికారులు? ఎలా ముందుకెళ్తారు అన్నది ఆసక్తికరంగా మారింది.

# బిజినెస్

# భారీగా తగ్గనున్న బంగారం ధర!

## మైక్రోసాఫ్ట్‌లో మళ్లీ ఉద్వాసనలు!




ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ మరోమారు ఉద్యోగులపై వేటు వేయడానికి సిద్ధం అవుతోంది. ఇప్పటికే వేలాది మందికి ఉద్వాసన పలికిన మైక్రోసాఫ్ట్ తాజా పునర్నిర్మాణంలో భాగంగా మరోమారు వేలాది మందిని ఇంటికి పంపించే పనిలో ఉందని బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. తాజా రౌండ్ ఉద్వాసనలు సేల్స్ విభాగంలో ఉండొచ్చని వెల్లడించింది. ఈ ఏడాది మే నెల మధ్యలో మూడు శాతం లేదా దాదాపు 6వేల మందిని తొలగించింది. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు కావడం గమనార్హం. మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడమే ముఖ్య లక్ష్యమని సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు. ఇక ఈ ఏడాది జనవరిలో కూడా పనితీరు ఆధారంగా కొంతమందిని ఆ సంస్థ తొలగించిన విషయం తెలిసిందే. ఈనెల ఆరంభంలో కూడా పలువురిపై సంస్థ వేటు వేసింది. సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలు చేస్తున్నామని మైక్రోసాఫ్ట్ పలుసార్లు పేర్కొంది.

## హైదరాబాద్‌లో ది కాస్‌కేడ్స్ నియోపోలిస్




జీహెచ్ఆర్ ఇన్‌ఫ్రా, లక్ష్మీ ఇన్‌ఫ్రా, అర్బన్‌బ్లాక్స్ రియల్టీ జాయింట్ వెంచర్ సంస్థ.. జీహెచ్ఆర్ లక్ష్మీ అర్బన్‌బ్లాక్స్ ఇన్‌ఫ్రా.. హైదరాబాద్, కోకాపేట్‌లో ది కాస్‌కేడ్స్ నియోపోలిస్ పేరుతో మెగా లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. నియోపోలిసలో 7.34 ఎకరాల విస్తీర్ణంలో 63 ఫ్లోర్లతో కూడిన ఐదు టవర్లు, మొత్తం 1,189.. 3 బీహెచ్‌కే, 4 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్లతో ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు సంస్థ డెసిగ్నేటెడ్ భాగస్వామి కర్తీశ్ రెడ్డి వెల్లడించారు. రూ.3,169 కోట్లతో అభివృద్ధి చేస్తున్న ఈ ప్రాజెక్ట్ 2030 నాటికి పూర్తిగా అందుబాటులోకి రానుందన్నారు. 2,560 చదరపు అడుగుల నుంచి 4,825 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ఫ్లాట్స్ అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కాగా ఈ ప్రాజెక్ట్‌కు ఎస్‌బీఐ రూ.900 కోట్ల నిధులను సమకూర్చిందని సంస్థ డెసిగ్నేటెడ్ భాగస్వాములు లక్ష్మీ నారాయణ, శరత్ వెల్లడించారు. ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ తయారీదారు ఓబెన్ ఎలక్ట్రిక్ సిరీస-ఏ ఫండింగ్‌లో భాగంగా మొత్తం రూ.100 కోట్లు సమీకరించింది. ఇందులో భాగంగా జనవరి నెలలో రూ.50 కోట్లు సమీకరించగా మే నెలలో మరో రూ.50 కోట్ల నిధులను సేకరించింది. హీలియోస్ హెూల్డింగ్స్, శారద ఫ్యామిలీ ఆఫీస్, కే ఫ్యామిలీ నుంచి ఈ మొత్తాలను సమీకరించింది. తాజా నిధులతో కంపెనీ ఇప్పటి వరకు సమీకరించిన నిధులు రూ.200 కోట్లకు చేరాయి. టెక్స్‌టైల్ రంగంలో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు గాను జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎసడీసీ)తో వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్ ఒప్పందం కుదుర్చుకుంది. రూ.425 కోట్లతో ఈ కార్యక్రమాన్ని చేపట్టనుంది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సంయుక్తంగా సర్టిఫికెట్ జారీ చేయనున్నాయి. వెల్‌స్పన్ తన టెక్స్‌టైల్ యూనిట్లలో వీరికి ఉపాధి అవకాశాలు కల్పించనుంది.

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలకు బంగారం ధరలు స్పందించడం లేదు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, రాబోయే నెలల్లో 10 శాతం, వచ్చే ఏడాది 30 శాతం వరకు ధరల్లో మార్పు రావొచ్చని అంటున్నారు. భౌగోళిక రాజకీయాలు, కేంద్ర బ్యాంకు కొనుగోళ్లు, జుఖీ డిమాండ్‌లు దీనికి కారణం. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర దాడులు జరుగుతూ ఉద్రిక్తతలు నెలకొన్నా.. ఆ ప్రభావం బంగారంపై ఏ మాత్రం కనిపించడం లేదు. ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం.. బంగారం ధర గరిష్ట స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. రాబోయే ఒకటి రెండు నెలల్లో బంగారం ధరల్లో దాదాపు 10 శాతం, వచ్చే ఏడాదిలో దాదాపు 30 శాతం మార్పు చూడవచ్చు. బులియన్ మార్కెట్లు ఇప్పటికే భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కేంద్ర బ్యాంకు కొనుగోళ్లు, జుఖీ డిమాండ్, డీ-డాలరైజేషన్‌ను ఫ్యాక్టర్ చేశాయని నిపుణులు అంటున్నారు. సిటీబ్యాంక్ వచ్చే ఏడాదికి బంగారం ధర అంచనాలను తగ్గించింది. దాని నివేదిక ప్రకారం.. సిటీబ్యాంక్ రాబోయే మూడు నెలలకు బంగారం రేటు అంచనాను ఔన్సుకు 3,500 నుండి 3,300 డాలర్లకు తగ్గించింది. తదుపరి 6-12 నెలలకు గతంలో ఔన్సుకు 3,000 డాలర్ల నుండి 2,800 డాలర్లకు తగ్గించింది. "గత 10-20 సంవత్సరాలలో మధ్యప్రాచ్యంలో, నల్ల సముద్రంలో ఒకేసారి యుద్ధాలు జరుగుతున్న పరిస్థితిని మనం చూడలేదు. ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధం జరుగుతున్న ఏడు రోజుల్లో మొదటి రోజు బంగారం ధర పెరిగింది. కానీ ఆ తర్వాత ఉద్రిక్తతలు పెరిగినప్పటికీ బంగారం ధరలపై ప్రభావం పడటం లేదు." అని కేడియా అడ్వైజరీకి చెందిన అజయ్ కేడియా అన్నారు. అయితే గతంలో ఇలాంటి పెరుగుదల సమయంలో బంగారం ధరలు కాస్త వెనక్కి తగ్గి తిరిగి కోలుకోవడం గమనించామని ఆయన అన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్స్ కు 3,371.15 డాలర్ల వద్ద ఉంది. అయితే గత ఐదు సంవత్సరాలలో మనం విన్న కథ ఏదైనా.. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కేంద్ర బ్యాంకు కొనుగోళ్లు, జుఖీ డిమాండ్, డీడాలరైజేషన్, బులియన్ మార్కెట్ ఇప్పటికే దీనికి కారణమైంది అని ఆయన అన్నారు. రాబోయే ఒకటి-రెండు నెలల్లో బంగారం ధరల్లో 8-10 శాతం తేడాను చూడవచ్చు. వచ్చే ఏడాదిలో బంగారం ధర 2,700-2,800 డాలర్లకు తగ్గవచ్చు. ప్రపంచ ఉద్రిక్తతలు గణనీయంగా తగ్గితే అది 2,400 డాలర్లకు కూడా తగ్గవచ్చు అని కేడియా పేర్కొన్నారు.




ఈ సంవత్సరంలో బంగారం ధరలు దాదాపు 30 శాతం పెరిగి ఔన్సుకు 3,355 డాలర్లకు చేరుకున్నాయి. జనవరి 1, 2025 నాటికి ఇది దాదాపు 2,600 డాలర్ల వద్ద ఉంది. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ, ఆర్థిక అనిశ్చితుల మధ్య సురక్షిత స్వర్గధామ ఆస్తులకు పెట్టుబడిదారుల డిమాండ్ పెరగడం వల్ల రేట్లు పెరిగాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల నిర్ణయాల నేపథ్యంలో పెట్టుబడిదారుల సెంటిమెంట్ రక్షణాత్మకంగా మారింది. ఇది చైనాతో వాణిజ్య యుద్ధ ఆందోళనలను తిరిగి రేకెత్తించింది. రష్యా-ఉక్రెయిన్ వివాదంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు సురక్షిత స్వర్గధామ డిమాండ్‌ను మరింత బలోపేతం చేశాయి.

# మార్కెట్లో మూడో రోజూ నష్టాలే

భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజు నష్టపోయాయి. గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 82.79 పాయింట్లు కోల్పోయి 81,361.87 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 18.80 పాయింట్ల నష్టంతో 24,793.25 వద్ద ముగిసింది. ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రతరమవుతుండటం, తత్ఫలితంగా ముడిచమురు ధరలు ఎగబాకుతున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అమ్మకాలను కొనసాగించడం ఇందుకు కారణమైంది. ప్రధాన కంపెనీలతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి షేర్లలో అమ్మకాల ఒత్తిడి అధికమైంది. దాంతో బీఎసఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.77 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.64 శాతం క్షీణించాయి. హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్ట్ డ్రగ్ రీసెర్చ్, మాన్యుఫాక్చరింగ్ కంపెనీ సాయి లైఫ్ సైన్సెస్ లిమిటెడ్‌లో అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ టీపీజీ ఏషియా వాటా తగ్గించుకోనుంది. సాయి లైఫ్‌లో 6 శాతం వాటాకు సమానమైన 1.25 కోట్ల షేర్లను టీపీజీ ఏషియా బ్లాక్ డీల్స్ ద్వారా ఓపెన్ మార్కెట్లో విక్రయానికి పెట్టినట్లు తెలిసింది. షేరు కనీస ధరను రూ.710గా నిర్ణయించినట్లుగా సమాచారం. కంపెనీ ప్రస్తుత మార్కెట్ ధర కంటే 2.5 శాతం తక్కువ ఇది. తద్వారా టీపీజీ ఏషియాకు రూ.885 కోట్ల వరకు సమాకూరనుంది. సాయి లైఫ్ సైన్సెసలో టీపీజీ ఏషియా ప్రస్తుతం 24.73 శాతం వాటా కలిగి ఉంది. బీఎసఈలో సాయి లైఫ్ షేరు గురువారం 1.26 శాతం క్షీణించి రూ.729.20 వద్ద ముగిసింది. ప్రైమరీ మార్కెట్లో వచ్చేవారం పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)ల సందడి పెరగనుంది.



మూడు కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.15,000 కోట్ల వరకు నిధులు సమీకరించేందుకు సిద్ధమయ్యాయి. అందులో సింహభాగం హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెసదే. ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫసీ బ్యాంక్ అనుబంధ విభాగమైన హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపీఓ ఈ నెల 25న (బుధవారం) ప్రారంభమై 27న (శుక్రవారం) ముగియనుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.12,500 కోట్లు సమీకరించనుంది. కాగా వచ్చే వారం పబ్లిక్ ఇష్యూల జాబితాలో ముంబైకి చెందిన రియల్ ఎస్టేట్ కంపెనీ కల్పతరు లిమిటెడ్ సహా ఎల్లెన్‌బ్యారీ ఇండస్ట్రియల్ గ్యాసెస్ కూడా ఉన్నాయి. కల్పతరు ఐపీఓ ఈ నెల 24న (మంగళవారం) ప్రారంభమై 26న (గురువారం) ముగియనుంది. ఐపీఓ ద్వారా రూ.1,590 కోట్లు సమీకరించనున్న ఈ కంపెనీ ఒక్కో షేరు ధరను రూ.387-414గా నిర్ణయించింది. ఎల్లెన్‌బ్యారీ గ్యాసెస్ ఐపీఓ కూడా 24న మొదలై 26న ముగియనుంది. షేరు ధరను రూ.380-400గా నిర్ణయించింది.

# నైట్‌రైడర్స్ హెడ్ కోచ్‌గా సీఎస్‌కే దిగ్గజం

# స్పోర్ట్స్

త్వరలో ప్రారంభం కానున్న కరీబియన్ ప్రీమియర్ లీగ్ 2025 సీజన్ కోసం ట్రిన్‌బాగో నైట్‌రైడర్స్ ఐపీఎల్ ఫైవ్ టైమ్ ఛాంపియన్ సీఎస్‌కేకు చెందిన దిగ్గజ ఆటగాడు డ్వేన్ బ్రావోను హెడ్ కోచ్‌గా నియమించుకుంది. ఈ మేరకు నైట్‌రైడర్స్ ఫ్రాంఛైజీ ఇవాళ (జూన్ 20) అధికారిక ప్రకటన విడుదల చేసింది. గత సీజన్ వరకు నైట్‌రైడర్స్‌కు హెడ్ కోచ్‌గా ఫిల్ సిమన్స్ ఉండేవాడు. సిమన్స్ బంగ్లాదేశ్ జట్టుకు హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తుండటంతో ఈ పదవి నుంచి తప్పుకున్నాడు. నైట్‌రైడర్స్ హెడ్ కోచ్‌గా ఎంపిక కావడంపై బ్రావో హర్షం వ్యక్తం చేశాడు. నా హృదయానికి చాలా దగ్గరగా ఉన్న ఈ ఫ్రాంచైజీకి హెడ్ కోచ్‌గా పని చేసే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నానని అన్నాడు. గత కొన్ని సంవత్సరాలుగా సిమన్స్ ఈ ఫ్రాంచైజీని అద్భుతంగా ముందుండి నడిపించినందుకు కృతజ్ఞతలు తెలిపాడు. నైట్‌రైడర్స్ హెడ్ కోచ్‌గా కొత్త సవాళ్లు స్వీకరించేందుకు సిద్ధమని అన్నాడు.



**బ్రావో కోచింగ్ కెరీర్‌పై ఓ లుక్కేద్దాం..**

2022లో ఐపీఎల్ నుంచి రిటైరైన బ్రావో.. కోచ్‌గా తన ప్రయాణాన్ని సీఎస్‌కేతోనే మొదలుపెట్టాడు. 2023 సీజన్‌లో అతను సీఎస్‌కే బౌలింగ్ కన్సల్టెంట్‌గా పని చేశాడు. ఆతర్వాత 2024 సీజన్‌లో ఇంటర్నేషనల్ లీగ్ టీ20లో అబుదాబి నైట్‌రైడర్స్‌కు హెడ్ కోచ్‌గా వ్యవహరించాడు. 2025 ఐపీఎల్ సీజన్‌కు ముందు కేకేఆర్ మెంటార్‌గా కొత్త బాధ్యతలు చేపట్టాడు. ఈ మధ్యలో బ్రావో ఆఫ్ఘనిస్తాన్ జాతీయ జట్టుకు బౌలింగ్ కన్సల్టెంట్‌గా పని చేశాడు. అతని ఆధ్వర్యంలో ఆ జట్టు 2024 టీ20 వరల్డ్‌కప్‌లో సెమీస్ వరకు చేరి చరిత్ర సృష్టించింది. ఆఫ్ఘనిస్తాన్ సాధించిన ఈ ఘనతలో బ్రావో పాత్ర చాలా కీలకంగా ఉండింది. పొట్టి క్రికెట్‌లో దిగ్గజ ఆల్‌రౌండర్ అయిన బ్రావోకు స్వదేశంలో జరిగే కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లోనూ ఘనమైన ట్రాక్ రికార్డు ఉంది. ఈ లీగ్‌లో బ్రావో 107 మ్యాచ్‌ల్లో 129 వికెట్లు తీసి నేటికీ లీడింగ్ వికెట్ టేకర్‌గా కొనసాగుతున్నాడు.

## విమాన ప్రమాద మృతులకు నివాళి.. నల్లరిబ్బన్లతో భారత్, ఇంగ్లండ్ ఆటగాళ్లు!



ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియా తొలి పరీక్షను ఎదుర్కొంటోంది. లీడ్సలోని హెడింగ్లేలో టాస్ గెలిచిన ఆతిథ్య జట్టు సారథి టీమిండియాను బ్యాటింగకు ఆహ్వానించాడు. ప్రత్యర్థి పేసర్లను అలవోకగా ఆడేస్తూ ఓపెనర్లు యశస్వీ జైస్వాల్0, కేఎల్ రాహుల్ శుభారంభం ఇచ్చారు. ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్‌లో అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు సంతాపం తెలిపిన భారత క్రికెటర్లు.. తొలి టెస్టు ఆరంభానికి ముందు కూడా నివాళులు అర్పించారు. %టాస్ అనంతరం మైదానంలోకి దిగడానికి.. ఇంగ్లండ్ ఆటగాళ్లు అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు నివాళులు అర్పించారు. హెడింగ్లే మైదానంలోకి దిగడానికి ముందు 2 నిమిషాలు మౌనం పాటించారు. అంతేకాదు నల్లబ్యాడ్జీలు ధరించి ఆటకు సిద్ధమయ్యారు. జూన్ 12న జరిగిన ఎయిరిండియా బోయింగ్ 171 డ్రీమ్‌లైనర్ విమానం ఘోర విమాన ప్రమాదంలో అందులోని మంది ప్రాణాలు కోల్పోయారు. బీజే ఆస్పత్రి కళాశాలపై విమానం కూలడంతో వైద్య విద్యార్థులు దుర్మరణం చెందారు. యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిన ఈ ఘటనపై పలు దేశాధినేతలు విచారం వ్యక్తం చేశారు. భారత క్రికెటర్లు కూడా సంతాపం తెలిపారు. ఈ సంఘటనతో బాధలో ఉన్నందున డబ్ల్యూటీసీ ఫైనల్ సమయంలో జరగాల్సిన అండర్సన్ - టెండూల్కర్ ట్రోఫీ ఆవిష్కరణ వాయిదా పడింది. అయితే.. తొలి టెస్టుకు ముందు సచిన్ అండర్సన్‌లు తమ పేరుతో నిర్వహిస్తున్న ట్రోఫీని ఆవిష్కరించి మురిసిపోయారు. ఈ సిరీస్‌లో గెలుపొందిన జట్టు కెప్టెన్‌కు 'పటౌడీ మెడల్'ను ఇస్తామని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు వెల్లడించిన విషయం తెలిసిందే.

# భారత్ నుంచి ఒక్క ప్లేయరే.. ఆ జట్టుతోనే జెమీమా!

భారత మహిళల క్రికెట్ జట్టు సభ్యురాలు జెమీమా రోడ్రిగ్స్‌ను మహిళల బిగ్ బాష్ లీగ్ ఫ్రాంచైజీ బ్రిస్బేన్ హీట్ తిరిగి తీసుకుంది. ఈ ఏడాది జరగనున్న డబ్ల్యూబీబీఎల్ 10వ సీజన్ కోసం భారత్ నుంచి 15 మంది ప్లేయర్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో ఇప్పటి వరకు ఒక్క జెమీమా మాత్రమే తిరిగి బీబీఎల్‌లో ఆడటం ఖరారైంది. కాగా గురువారం జరిగిన ప్లేయర్ల డ్రాఫ్టింగ్‌లో లీగ్‌లోని మొత్తం 8 ఫ్రాంఛైజీలు 23 మంది అంతర్జాతీయ ప్లేయర్లను ఎంపిక చేసుకున్నాయి. జెమీమా రోడ్రిగ్స్‌తో పాటు చినెల్లి హెన్రీ (వెస్టిండీస్), డి క్లెర్క్ (దక్షిణాఫ్రికా)ను బ్రిస్బేన్ ఫ్రాంచైజీ ఎంపిక చేసుకుంది. 'అభిమానులను ఆకట్టుకోగల సత్తా జెమీమాకు ఉంది' అని బ్రిస్బేన్ హీట్ యాజమాన్యం వ్యాఖ్యానించింది. జెమీమాకిది నాలుగో బిగ్‌బాష్ లీగ్ సీజన్ కానుంది. 2021%-%2022 సీజన్‌లో మెల్‌బోర్న్ రెనెగెడ్స్ తరఫున... 2022%-%2023 సీజన్‌లో మెల్‌బోర్న్ స్టార్స్ తరఫున... 2024%-%2025 సీజన్‌లో బ్రిస్బేన్ హీట్ తరఫున జెమీమా ఆడింది. ఓవరాల్‌గా బిగ్‌బాష్ లీగ్‌లో జెమీమా 30 మ్యాచ్‌లు ఆడి 644 పరుగులు చేసింది. ఇందులో మూడు అర్థ సెంచరీలున్నాయి. మరోవైపు.. శ్రీలంక కెప్టెన్ చమరి ఆటపట్టు, షబ్నమ్ ఇస్మాయిల్ (దక్షిణాఫ్రికా), హీథెర్ నైట్ (ఇంగ్లండ్)ను సిడ్నీ థండర్ జట్టు తీసుకుంది. సోఫియా డంక్లీ, మ్యాడీ విలియర్స్ (ఇంగ్లండ్), అమేలియా కెర్ (న్యూజిలాండ్)ను సిడ్నీ సిక్సర్స్ జట్టు తీసుకుంది. సోఫీ ఎకిల్‌స్టోన్, టామీ బ్యూమాంట్ (ఇంగ్లండ్) , లౌరా వాల్వర్డ్ (దక్షిణాఫ్రికా)ను అడిలైడ్ స్ట్రయికర్స్ ఎంపిక చేసుకోగా... అమీ జోన్స్, డానీ గిబ్సన్ (ఇంగ్లండ్), మరిజాన్ కాప్ (దక్షిణాఫ్రికా)ను మెల్‌బోర్న్ స్టార్స్ జట్టు ఎంపిక చేసుకుంది. సోఫీ డివైన్ (న్యూజిలాండ్), స్కోల్‌ఫీల్డ్ (ఇంగ్లండ్), ఛ్లో ట్రియాన్ (దక్షిణాఫ్రికా) పెర్ స్కోచెర్స్ జట్టుకు ఎంపికయ్యారు. ఇక డానియల్ వ్యాట్, లినెస్సీ స్మిత్ హెూబర్ట్ హరికేన్స్‌కు ప్రాతినిధ్యం వహించనుండగా... మెల్‌బోర్న్ రెనెగెడ్స్ తరఫున డియాండ్రా డాటిన్, అలీస్ కాప్సీ బరిలోకి దిగనున్నారు.









# 'కరుప్పు' అంటూ వస్తున్న సూర్య.. టైటిల్ ఫస్ట్ లుక్ రిలీజ్

తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటులలో కథానాయకుడు సూర్య ఒకరు. ఆయన నటించిన ప్రతి సినిమా ఇక్కడ కూడా విడుదలవుతుంది. అంతేకాదు, వైవిధ్యానికి పెద్ద పీట వేస్తూ ఆసక్తికర చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వస్తారు. ఇప్పటికే తెలుగు దర్శకుడు వెంకి అట్లూరితో సినిమా చేస్తున్న సూర్య తమిళ కమెడియన్ ఆర్జే బాలాజీ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నాడు. సూర్య 45గా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి తాజాగా ఫస్ట్‌లుక్‌తో పాటు టైటిల్‌ను ప్రకటించింది చిత్రయూనిట్. ఈ సినిమాకు కరుప్పు (నలుపు) అనే టైటిల్ పెట్టినట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ మూవీకి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నాడు.



# 'పెద్ది'లో రామ్ బుజ్జిగా దివ్యేందు..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'పెద్ది'. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫిలిం మేకర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో విజనరీ వెంకట సతీష్ కిలారు తన ప్రతిష్టాత్మక బ్యానర్ వృద్ధి సినిమాస్ బ్యానర్ పై భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో 'మీర్జాపూర్' వెబ్‌సిరీస్ ఫేమ్, బాలీవుడ్ స్టార్ యాక్టర్ దివ్యేందు శర్మ కీలక పాత్ర చేస్తున్నారు. గురువారం మేకర్స్ ఆయనకి బర్త్ డే విషెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో రామ్ బుజ్జి అనే ఆసక్తికరమైన క్యారెక్టర్‌లో ఆయన కనిపించబోతున్నారు. క్రికెట్ బంతిని ఎగరేస్తూ ఇంటెన్స్ లుక్‌లో కనిపించిన దివ్యేందు పోస్టర్ అదిరిపోయింది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్మించిన మాసీవ్ సెట్లో హై-ఆక్టేన్, హై బడ్జెట్‌తో ఓ భారీ ట్రైన్ యాక్షన్ ఎపిసోడ్ షూట్ చేస్తున్నారు. ఈ మైండ్- బ్లోయింగ్ యాక్షన్ సీక్వెన్స్ సినిమాలో మేజర్ హైలైట్‌గా వుండబోతోంది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్ కుమార్, జగపతి బాబు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రం 2026 మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజున ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.





# ఓటీటీకి పూరి జగన్నాథ్ తమ్ముడి సినిమా..

దర్శకుడు పూరి జగన్నాథ్ సోదరుడు శ్రీరామ్ శంకర్ హీరోగా నటించిన చిత్రం ఒక పథకం ప్రకారం. ఈ ఏడాదిలో ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా అంతగా ఆకట్టుకోలేకపోయింది. ఈ సినిమాకు మలయాళ డైరెక్టర్ వినోద్ కుమార్ విజయన్ దర్శకత్వం వహించారు. క్రైమ్ థ్రిల్లర్ జోనర్లో వచ్చిన ఈ సినిమాలో శృతి సోది, ఆషిమా నర్వాల్, సముద్రఖని కీలక పాత్రలు పోషించారు. తాజాగా ఈ సినిమా ఓటీటీకి వచ్చేసింది. రిలీజైన ఐదు నెలల తర్వాత ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ రోజు నుంచే సన్ నెక్స్ట్‌లో అందుబాటులోకి వచ్చింది. ఈ సినిమా క్లైమాక్స్ యాక్షన్ సీన్ కోసం 25 డాగ్స్‌తో ఫైట్ సీన్ తెరకెక్కించారు. కాగా.. హీరో సాయిరాం శంకర్ 143, బంపర్ ఆఫర్ లాంటి సినిమాలతో టాలీవుడ్‌లో గుర్తింపు తెచ్చుకున్నారు. చాలా గ్యాప్ ఇచ్చిన ఈ ఏడాది ఒక పథకం ప్రకారం అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. ఈ కథ మొత్తం 2014 విశాఖపట్నంలో జరుగుతూ ఉంటుంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిద్ధార్థ నీలకంఠ (సాయిరాం శంకర్) భార్య సీత (ఆషిమా నర్వాల్) షాపింగ్ కి వెళ్లగా అక్కడ భార్య మిస్ అవుతుంది. ఆమె ఏమైందో తెలియక ఇబ్బంది పడుతున్న సిద్ధార్థ డ్రగ్స్‌కు బానిస అవుతాడు. అయితే సిద్ధార్థతో కలిసి డ్రగ్స్ తీసుకునే దివ్య(భాను శ్రీ) అనూహ్యంగా దారుణమైన స్థితిలో హత్యకు గురవుతుంది. ఈ కేసు విచారణలో ఏసిపి రఘురాం(సముద్రఖని), సిద్ధార్థ ఈ మర్డర్ చేశాడని భావించి అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెడితే డ్రగ్స్ కేసు కారణంగా సస్పెండ్ కావడంతో ఆ స్థానంలో ప్రాసిక్యూటర్‌గా రావాలని ప్రయత్నించే చినబాబు (కళాభవన్ మణి) కూడా సిద్ధార్థని ఇరికించే ప్రయత్నం చేస్తాడు. అయితే తాను స్వతహాగా లాయర్ కావడంతో తాను హత్య చేయలేదని నిరూపించుకునే ప్రయత్నం చేస్తాడు సిద్ధార్థ్. తర్వాత ఇదే క్రమంలో అనేక హత్యలు జరుగుతున్నాయని తెలుసుకుని అసలు ఈ హత్యలకు కారణం ఎవరు అని తెలుసుకునే ప్రయత్నం చేస్తాడు.



# బికినీలో రమ్య పసుపులేటి అందాల జాతర..



## సిటీలో 'అనంత పద్మనాభ స్వామి' సెట్..

# పాట కోసమే పది కోట్లు!

'పెదకాపు' చిత్రం ఫేమ్ విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'నాగబంధం'. 'ది సీక్రెట్ ట్రెజర్' అన్నది ట్యాగ్‌లైన్. నిర్మాత అభిషేక్ నామా ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. నభా నటేశ్, ఐశ్వర్యా మీనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పణలో ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్‌పై కిశోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సినిమా కోసం ప్రొడక్షన్ డిజైనర్ అశోక్ కుమార్ ప్రత్యేకంగా తీర్చిదిద్దిన కేరళ అనంత పద్మనాభ స్వామి టెంపుల్ సెట్‌లో పాట చిత్రీకరణ జరుగుతోంది. "ఈ పాటలో విరాట్ కర్ణతో పాటు 5000 మంది నృత్య కళాకారులు పాల్గొంటున్నారు. బాలీవుడ్ కొరియోగ్రాఫర్ గణేశ్ ఆచార్య పర్యవేక్షణలో ఈ పాటను చిత్రీకరిస్తున్నాం. ఈ ఒక్క ఎపిసోడ్‌కే రూ. 10 కోట్లు బడ్జెట్ కేటాయించాం. ఈ అద్భుతమైన సీక్వెన్స్ ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉంటుంది" అని చిత్రయూనిట్ పేర్కొంది. జగపతిబాబు, జయప్రకాశ్, మురళీ శర్మ, బీఎస్ అవినాష్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్ ఎస్, సంగీతం: అభే.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.